విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు,
మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు
కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY    R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ వాణి కుటుంబ సభ్యులకు 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ వాణి పాత్రికేయ కుటుంబ సభ్యులు, పాఠకులు, ప్రకటనకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు శుభాకాంక్షలు



ఎడిటర్
జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 83 | శనివారం 18. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## 5 లక్షలకు 111 ప్రశ్నల విక్రయం



- నీట్ పేపర్ లీక్‌లో సంచలన అంశాలు
- సీబీఐ దర్యాప్తులో కీలక ఆధారాలు.. కోర్టుకు నివేదిక
- కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫోన్‌లో లీకైన ప్రశ్నల ఆనవాళ్లు
- పరీక్షకు 10 రోజుల ముందే ప్రశ్నలు చేరినట్లు సీబీఐ వెల్లడి

4



## పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ

4

## పార్లమెంట్ సమావేశాలకు కొత్త నిబంధనలు



- జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు
- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం మార్గదర్శకాలు జారీ

# ధరణి'పై దర్యాప్తునకు 'సిట్'

## సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం

- దాదాపు మూడు గంటల పాటు నిర్విరామంగా జరిగిన కేబినెట్ భేటీ
- గత కొన్నేళ్లుగా ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులు,
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ లావాదేవీల వ్యవహారం
- రాష్ట్ర రాజకీయాల్లో మరింత పొలిటికల్ హీట్ పెంచే అవకాశం క
- విద్యాశాఖలో పోస్టుల భర్తీకి కూడా ఆమోదం
- వివిధ సంస్థలకు గాను భూ కేటాయింపులకు ఆమోదముద్ర
- పాలమూరు ప్రాజెక్టుకు పెరిగిన అంచానాలకు ఆమోదం
- ఇక బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పులకు కూడా ఓకే చెప్పేశారు.
- గ్రామ పంచాయతీల ఆర్థిక వెసులుబాటుకు కేబినెట్ ఆమోదం ముద్ర
- జిగిత్యాల జిల్లాలో డిగ్రీ కాలేజ్‌లో పోస్టుల భర్తీకి,
- పటాన్‌చెరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్



# నగదు రహిత చికిత్సలు..

## ఇకపై ఉద్యోగులు ధైర్యంగా ఉండొచ్చు

- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పదేళ్లు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు
- ప్రభుత్వ ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్) పోర్టల్ ప్రారంభం
- ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేశాం
- నగదు రహిత చికిత్సల విషయంలో ఇకపై ఉద్యోగులు ధైర్యంగా ఉండొచ్చు
- "రాష్ట్రంలో నూతన అధ్యాయం మొదలైంది. వైద్య ఖర్చులను భరించలేనిస్థితిలో ఉన్నాం
- సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటంలో ఉద్యోగులు ఎంతో కీలకం.
- 9.5లక్షల మంది ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపేలా నూతన ఈహెచ్‌ఎస్ తీసుకొచ్చాం.
- విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచింది.
- 1.06 కోట్ల మంది పేదలకు ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం.
- ప్రజా ప్రభుత్వం రూ.2వేల కోట్ల బిల్లులను క్లియర్ చేసింది"



## దేవాదాయ శాఖలో 191 మందికి నియామక పత్రాలు

హైదరాబాద్ తెలంగాణ వాణి)

దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 191 మంది ఉద్యోగులకు కొండా సురేఖ నియామక ఉత్తర్వులను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.

## ఓటరు జాబితా నుంచి తొలగిస్తే.. పౌరసత్వం కోల్పోయినట్లు కాదు

హైదరాబాద్ తెలంగాణ వాణి)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం కోల్పోయినట్లు కాదని వ్యాఖ్యానించింది. అంతేకాదు.. ఈ జాబితా నుంచి తొలగించబడిన వ్యక్తులకు సంక్షేమ పథకాలను నిరాకరించవచ్చా? లేదా? అన్న విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో 'సర్'పై వచ్చిన అభ్యంతరాలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు ఎన్నికల సంఘం తో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో తమ పేరు కోల్పోయిన వారి అప్పీళ్లను ప్రత్యేక ట్రైబ్యునళ్లు పరిష్కరిస్తున్నాయి. ఈ క్రమంలో తిరస్కరణకు గురైన వ్యక్తులకు సంక్షేమ పథకాలు నిరాకరించకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ అనే వ్యక్తి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటరు జాబితాలో పేరు తొలగించిన వెంటనే.. ప్రజా పంపిణీ వ్యవస్థ అన్నపూర్ణతోపాటు ఆర్థిక సాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సంబంధిత వ్యక్తికి అందకుండా బెంగాల్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. దాదాపు 34లక్షల అప్పీళ్లు ట్రైబ్యునళ్ల ముందు పెండింగు దశలోనే ఉన్నాయని.. ఇప్పటివరకు కేవలం 38 వేల అప్పీళ్లకు మాత్రమే పరిష్కారం లభించిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. దీనిపై ఇప్పటికే (బిహార్ 'సర్' విషయంలో) క్లారిటీ ఇచ్చామని పేర్కొంది.




## తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

3



## 2014కు ముందు ఇలా జరిగితే రైల్వేలు కుప్పకూలేవి



- భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ
- గల్ఫ్ సంక్షోభాన్ని తమ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంది
- హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో హైడ్రోజన్‌తో నడిచే రైలు ప్రారంభం
- "మనం రైల్వేల చరిత్రను పరిశీలిస్తే.. 19వ శతాబ్దంలో ఆవిరియంత్రం ఆధారంగా నడిచేవి.
- 20వ శతాబ్దంలో డీజిల్, విద్యుత్ శక్తి ఇంధనంగా ఉండగా..
- 21వ శతాబ్దపు రైల్వే హైడ్రోజన్ శక్తితో నడుస్తోంది.
- హర్మూజ్‌లో ఇంధన నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి.
- భారత్‌లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం సంసిద్ధమవుతుతోంది.

## బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్: బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. శాంతియుతంగా నిర్వహించుకోవాలంటూ షరతులతో కూడిన అను మతిని ఉన్నత న్యాయస్థానం మంజూరు చేసింది. రహదారుల దిగ్బంధం, రెచ్చగొట్టే విధానం ఉండొద్దని బీఆర్ఎస్‌ను ఆదేశించింది. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో శనివారం యువ సంగ్రామ సదస్సు నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు చేసింది. అయితే పోలీసులు దీనికి అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ పార్టీ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ ఇంటెలిజెన్స్ రిపోర్టు ఉందని హోంశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజే హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సదస్సు నిర్వహించే ప్రాంతంలో పార్కింగ్‌కు ఏర్పాట్లు లేవన్నారు. దీనిపై స్పందించిన ఉన్నత న్యాయస్థానం.. 17 రోజుల క్రితం అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే ఎందుకు నిర్ణయం తీసుకోలేదని.. ఏదైనా సమస్య ఉంటే ఎందుకు వారికి సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించింది. అనంతరం సదస్సుకు అనుమతి ఇస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.



## ఈ నెల 31 వరకు రేషన్ కార్డు కేవైసీ గడువు

- లబ్ధిదారులకు పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ
- ఆధార్ కార్డులను తీసుకొని స్థానిక రేషన్ డీలర్ వద్ద లేదా సమీపంలోని 'మీ సేవ' చేసుకోవచ్చు
- నకిలీ రేషన్ కార్డులను ఏరివేయడంతో పాటు, అర్హులైన అసలైన లబ్ధిదారులకు మాత్రమే ..

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం

రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు

2



## వినాయక మండపాలపై ఆంక్షలా

- దేవుని విగ్రహాలను కాపాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది
- పోలీసుల తీరుపై మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆగ్రహం



**కరీంనగర్, జులై 17 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ నగరంలో గణప తి నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై పోలీసుల ఆంక్షలు,శాంతిభద్రతల వైఫల్యంపై కరీంనగర్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి గంగుల కమలాకర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సప్తగిరి కాలనీలో వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతులు నిరాకరిం చడంతో కాలనీవాసుల అభ్యర్థన మేరకు శుక్రవారం ఆయన అక్కడ క్షేత్రస్థాయి లో పర్యటించారు.

**పోలీసుల తీరుపై విమర్శల జడివాన**
ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీసుల కు గతంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉండేదని, కానీ నేడు కరీంనగర్ పోలీ సుల వైఫల్యంతో శాంతిభద్ర తలు అదుపు తప్పుతున్నా యని ఆరోపించారు."38 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ప్రజలు గణపతి,దుర్గా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించు కుంటున్నారు.అలాంటిది ఇప్పుడు మండపాలు పెట్టవద్దని చెప్పడం ఎంత వరకు సమంజసం?" అని ఆయన పోలీసులను ప్రశ్నించారు.కేవలం ఒక రాజకీయ పార్టీకి (బీజేపీ) అనుకూలంగా వ్యవహరి స్తూ ఇతర మండపాలకు అనుమతులు నిరాకరించ డం సరికాదన్నారు.

**బొమ్మకల్ ఘటనపై ఆగ్రహం**
బొమ్మకల్ హనుమాన్ విగ్రహం చోరీ ఘటనను ఆయన ప్రస్తావిస్తూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని దొంగిలించిన వ్యక్తులను పట్టుకోవాల్సిన పోలీసులు,అది ఎక్కడుందో వెతికి పట్టుకుని ప్రతిష్ఠించిన తనపై, బీఆర్ఎస్ శ్రేణులపై నే క్రిమినల్ కేసులు నమో దు చేయడం విడ్డూరమన్నా రు "దేవుని విగ్రహాలను చోరీ కాకుండా కాపలా కాయా ల్సిన దుస్థితి రావడం పోలీసుల అసమర్థతకు నిదర్శనం"అని ఆయన విమర్శించారు.

**రాజమర్యాదలా**
తన క్యాంపు కార్యాలయం పై బీజేపీ శ్రేణులు దాడి చేసినప్పుడు వారిపై ఎటు వంటి కేసులు నమోదు చేయకుండా,పైగా స్టేషన్‌కు పిలిపించి రాజమర్యాదలు చేసి పంపడం దేనికి సంకేత మని ఆయన పోలీసులను నిలదీశారు.కరీంనగర్‌లో శాంతిభద్రతలను కాపాడా ల్సిన బాధ్యత పోలీస్ కమిషనర్ దేనని ఆయన గుర్తు చేశారు.?ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి,కరీంనగర్ పోలీసు వ్యవస్థను గాడిన పెట్టాలని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని గంగుల డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు,మాజీ కార్పొ రేటర్లు,బీఆర్ఎస్ నేతలు, కాలనీవాసులు పాల్గొ న్నారు.

## బాధ్యతలు స్వీకరించిన అధికారులను మర్యాద పూర్వకంగా కలిసిన టీఎన్జీవోల సంఘం ప్రతినిధులు



**కరీంనగర్:జులై 17 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ జిల్లాలో నూతనంగా భాధ్య తలు తీసుకున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజిషన్) ఎల్.రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెద్ది రెడ్డి భాగ్యలక్ష్మి,బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షు డు,ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీవోల సంఘం ప్రతినిధులు శుక్ర వారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి పారు.
ఈ సందర్భంగా నూతన అధికారులకు శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలు అంద జేసి ఘనంగా సత్కరించా రు.వారు తమ నూతన బాధ్యతల్లో విజయవంతం గా ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి,ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సంఘం నాయకులు ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా పరిపాలనలో అధికా రులు,ఉద్యోగులు పరస్పర సమన్వయంతో పనిచేసిన ప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరుతా యని అన్నారు.ఉద్యోగులు ఎదుర్కొంటున్న పరిపాలనా సంబంధిత సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి,ప్రభుత్వ నిబంధ నలకు అనుగుణంగా పరిష్కరించేలా సహకరిం చాలని అధికారులను కోరారు.దీనికి స్పందించిన ఇరు అధికారులు,ఉద్యో గుల సమస్యలను సాను భూతితో పరిశీలించి, చట్టబద్ధమైన అంశాల్లో అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తా మని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్,టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ రావు,జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ ఇరుమల్ల శారద,పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్,పట్టణ కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు,నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి,జిల్లా కార్యదర్శి శంకర్,నాయ కులు లవకుమార్,కరు ణాకర్,బోనాల రవి, రాజేశ్వరరావు,విజయ పాల్ రెడ్డి,అంజయ్య, సత్యనారాయణ,మర్రి శ్రీనివాస్,శైలజ,జిల్లా,పట్టణ శాఖల నాయకులు,వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని నూత న అధికారులకు శుభాకాం క్షలు తెలిపారు.

## సంపాదకీయంచిట్టి ఉమేశ్వర్ చొరవతో ఒస్మాన్ నగర్‌లో రోడ్ల మరమ్మతులు



**తెల్లాపూర్ జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెల్లాపూర్ పరిధిలోని ఒస్మాన్ నగర్‌లో దెబ్బతిన్న రోడ్లకు బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు చిట్టి ఉమేశ్వర్ చొరవతో మరమ్మతు పనులు చేపట్టారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రోడ్ల మరమ్మతులు చేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనుల వల్ల రాకపోకలు సులభతరం అవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ములుకనూర్ ప్రజా గ్రంథాలయం పుట్టుక -- ఒక గ్రామ చైతన్యానికి జ్ఞానోదయ గాథ

## సంపాదకీయం



ములుకనూర్... ఈ పేరు కేవలం ఒక గ్రామాన్ని సూచించే భౌగోళిక గుర్తింపు మాత్రమే కాదు; అది చరిత్రను సృష్టించిన చైతన్యానికి, త్యాగాన్ని జీవన విలువగా మలచుకున్న సంస్కృతికి, అభివృద్ధిని సామూహిక సంకల్పంగా ఆవిష్కరించుకున్న ప్రజాస్ఫూర్తికి ప్రతీక. కాలగర్భంలో కలిసిపోని అనేక చారిత్రక మైలురాళ్లను తన ఒడిలో దాచుకున్న ఈ గ్రామం, తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. సహకార స్ఫూర్తి, సామాజిక బాధ్యత, విద్యా వికాసం, ప్రజాస్వామ్య చైతన్యం---ఈ నాలుగు మూలస్తంభాలపై తన ప్రగతి పథాన్ని నిర్మించుకున్న గ్రామం ములుకనూర్.
ఆసియా ఖండంలోనే రెండవ స్థానాన్ని అలంకరించిన లిములుకనూర్ సహకార గ్రామీణ పరపతి బ్యాంకు (1956)లి ఈ గ్రామ ఆర్థిక దార్శనికతకు ప్రతీకగా నిలిస్తే, లిభారతదేశంలోనే తొలి మహిళా సహకార డెయిరీ (2002)లి స్థాపన మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనం గా నిలిచింది.
అంతేకాదు, దేశంలోనే అత్యధిక సంఖ్యలో స్వాతంత్ర్య సమరయోధులను అందించిన గ్రామంగా ములుకనూర్ చరిత్రలో చిరస్థాయిగా తన పేరును లిఖించుకుంది.
చరిత్రను గౌరవించే ప్రతి సమాజం తన భావితరాలకు జ్ఞాన వారసత్వాన్ని అందించగలగాలి. ఆ జ్ఞాన వారసత్వానికి నిలయాలే ప్రజా గ్రంథాలయాలు. ఒక సమాజం యొక్క మేధో సంపత్తి పుస్తకాలలో నిల్వ ఉంటే, ఆ పుస్తకాలకు జీవం పోసేది గ్రంథాలయం. అందుకే గ్రంథాలయం అనేది ఇటుకలతో నిర్మించిన భవనం కాదు; అది ఆలోచనలకు ఉత్ప్రేరకం,విజ్ఞానానికి నెలవు, వ్యక్తిత్వ వికాసానికి పునాది, సామాజిక పరివర్తనకు ప్రేరణ.
అలాంటి ఒక జ్ఞానాలయం ములుకనూర్‌లో ఉండాలనే సంకల్పం డాక్టర్ తిరుపతి నేతృత్వం లోని పిడికెడు మంది యువత మస్తిష్కంలో ఒక ఆలోచనగా మొలకెత్తింది. ఆ ఆలోచన గ్రామ భవిష్యత్తుపై యువతకు ఉన్న బాధ్యతాభావానికి ప్రతిరూపం.విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా కాకుండా, ఓ ఆదర్శ సమాజ నిర్మాణానికి ఆధారశక్తిగా భావించిన మహోన్నత తరుణమది.
ఆ సమయం లో గ్రామంలో విద్యాధికులైన యువకులు, మేధావులు సమావేశమై, ప్రతి నెలా ఒకసారి కలుసుకునేందుకు ఓ పొదుపు మార్గాన్ని ఎంపిక చేసుకుని నెలసరి చిట్టీ నడపడానికి నిర్ణయించుకున్నారు.
సంఘజీవనం స్ఫూర్తి తో
-"నెలకు ఒక్కసారి కలుసుకోవడం ఎందుకు? ప్రతిరోజూ కలుసుకునే ఒక వేదికను ఎందుకు నిర్మించకూడదు? ఆ వేదిక ఒక ప్రజా గ్రంథాలయం ఎందుకు కాకూడదు?"
అనే భావనతో
మొలకెత్తిన సంకల్పం లివీ.+.ాలి రూపంలో అక్షరరూపం దాల్చింది. ఆ సంకల్పానికి లి'స్పందన'లి రూపంలో సామాజిక మద్దతు లభించింది. ఆ మద్దతు క్రమంగా ఉద్యమ స్వరూపాన్ని సంతరించుకొని ప్రజల భాగస్వామ్యంతో ఒక చారిత్రక జ్ఞానోద్యమంగా పరిణమించింది.
ఈ మహత్తర యజ్ఞానికి తొలి నాంది లి2012 జనవరి 12న, భారత యువతకు చిరస్మరణీయ స్ఫూర్తి ప్రదాత లిలిస్వామి వివేకానంద జయంతిలి సందర్భంగా లిశ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలి ప్రాంగణంలో పలికింది. ఆ రోజు ఒక కార్యక్రమం ప్రారంభం మాత్రమే కాదు; ములుకనూర్ మేధో చరిత్రలో ఒక నూతన అధ్యాయం ఆవిష్కృతమైన రోజు.
ఏ మహత్తర ఉద్యమమైనా ప్రజల విశ్వాసంతోనే నిలబడుతుంది. ములుకనూర్ ప్రజా గ్రంథాలయం కూడా అందుకు మినహాయింపు కాదు. ఈ సంకల్పాన్ని మొదటగా హృదయపూర్వకంగా ఆశీర్వదించిన వారు సామాజిక స్పృహ కలిగిన గ్రామ సీనియర్ గురువర్యులు, కీర్తిశేషులు లివానమామలై కృష్ణమాచార్యులు. వారు తమ స్వహస్తాలతో అక్షరాల లిలిరూ.10,000లి విరాళం అందించి ఈ జ్ఞానయజ్ఞానికి శుభారంభం పలికారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కీర్తిశేషులు పడాల చంద్రయ్యలి కూడా మరో లిరూ.10,000లి విరాళం అందించి ఈ ఉద్యమానికి అండగా నిలిచారు.
నిజానికి, ప్రజల భాగస్వామ్యంతో నిర్మించబడిన ప్రతి సంస్థకు ఆత్మ ఉంటుంది. ములుకనూర్ ప్రజా గ్రంథాలయం అలాంటి ఆత్మ కలిగిన జ్ఞానాలయం. ఇది కేవలం పుస్తకాల నిల్వ కేంద్రం కాదు; గ్రామ మేధోసంపదకు నిలయం, భావితరాల భవిష్యత్తుకు పునాది, సమాజ పరివర్తనకు దిక్సూచి, ప్రజల సమిష్టి సంకల్పానికి సజీవ సాక్ష్యం.

### సంకల్పం నుండి సంస్థాగత వికాసం వరకు

ఈ జ్ఞానయజ్ఞం విస్తృత రూపాన్ని సంతరించుకుంటున్న తరుణంలో, లి2013 సంవత్సరంలోలి స్థానిక లిఎస్.ఆర్.టి. కళాశాలలి రజతోత్సవ (ాఅశ్రీజవతీ జీబఎఅశ్రీవవ) వేడుకలు ఒక చారిత్రక అవకాశంగా మారాయి. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్పందన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, అప్పటి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. వేముల శ్రీనివాసులు కిలి ప్రజా గ్రంథాలయ సంకల్పం గురించి వినయపూర్వకంగా వివరించే అవకాశం లభించింది.
యన ఆ ప్రతిపాదనను ఒక సాధారణ అభ్యర్థనగా చూడలేదు; గ్రామ భవిష్యత్తును మలిచే ప్రజా అవసరంగా గుర్తించారు. లి"మేము మీ వెంటే ఉంటాం"లి అనే ఆయన హామీ కేవలం ప్రోత్సాహక వాక్యం మాత్రమే కాదు; ఆ ఉద్యమానికి అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చారిత్రక భరోసా. ఆ క్షణం నుంచే లివీ.+.ాలి మరియు లిస్పందనలి సంస్థలు కలసి ప్రజా గ్రంథాలయ నిర్మాణాన్ని ఒక సామాజిక ఉద్యమంగా మలిచాయి.
ఆ సమిష్టి సంకల్ప ఫలితంగానే లి2014 నవంబర్ 14వ తేదీనలి, ములుకనూర్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల భవనాన్ని అద్దెకు తీసుకొని ప్రజా గ్రంథాలయం తన సేవా ప్రయాణాన్ని మరింత విస్తృత స్థాయిలో కొనసాగించింది.
ఆ మహత్తర కార్యక్రమానికి తెలంగాణా సిద్ధాంతకర్త,ఉద్యమ రథసారథి లిఆచార్య ఎం. కోదండరాం లి, ప్రజా ఉద్యమకారుడు లిపాషం యాదగిరి లి, స్థానిక శాసనసభ్యులు ఒడితల సతీష్ బాబులి, అలాగే లి వేముల శ్రీనివాసులు తదితరులు విచ్చేసి తమ ఆశీస్సులు అందించడం ప్రజా గ్రంథాలయ ఉద్యమానికి విశేష గౌరవాన్ని తీసుకువచ్చింది.
ఆ సమిష్టి కృషి ఫలితంగా నిర్మితమైన నూతన భవనంలోకి లి2018 జూలై 30నలి కడియం శ్రీ హరి , కెప్టెన్ లక్ష్మీ కాంతారావు , ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ తదితరులు హాజరై ప్రజా గ్రంథాలయం ఘనంగా ప్రారంభం చేశారు. పాఠకుడు కోరిన పుస్తకాన్ని సాధ్యమైనంత త్వరగా సమకూర్చే స్థాయికి గ్రంథాలయం ఎదిగింది.
కాలానుగుణంగా యువత అవసరాలను గుర్తించి లిస్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ, లిలికంప్యూటర్ శిక్షణ, లిలిపోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్, లిలిఆన్‌లైన్ తరగతుల సౌకర్యం, లిలిబ్యూటీషియన్ కోర్సులు, లిలిజ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణలి వంటి అనేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభమయ్యాయి. ఇరువై ఐదు వేల పుస్తకాలతో విరాజిల్లుతున్న ఈ గ్రంథాలయం కి ప్రతి రోజు యాభై మంది దాకా వచ్చి పుస్తక పఠనం చేస్తూ ఉంటారు.
సాహిత్య వికాసం సమాజ చైతన్యానికి పునాది అనే విశ్వాసంతో లి2019 సంవత్సరం నుంచిలి ప్రతి ఏడాది లిజాతీయ స్థాయి తెలుగు కథల పోటీలనులి నిర్వహించడం ప్రారంభించాము. దాదాపు లిమూడు నుండి ఐదు లక్షల రూపాయల వరకు నగదు బహుమతులులి అందిస్తూ దేశవ్యాప్తంగా తెలుగు కథా రచయితలకు ఒక ప్రతిష్ఠాత్మక వేదికను కల్పించాము. ఈ కార్యక్రమం ద్వారా ములుకనూర్ పేరు తెలంగాణకే పరిమితం కాకుండా తెలుగు సాహిత్య ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించింది.
ఈ విధంగా ములుకనూర్ ప్రజా గ్రంథాలయం కేవలం ఒక విద్యా సంస్థగా కాకుండా, పఠన సంస్కృతిని పెంపొందించే ఉద్యమంగా, సాహిత్యాన్ని ప్రోత్సహించే వేదికగా, యువతకు దిశానిర్దేశం చేసే శిక్షణా కేంద్రంగా, గ్రామ సమాజాన్ని జ్ఞాన సమాజంగా తీర్చిదిద్దే సామాజిక పరివర్తన కేంద్రంగా తన ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది.

### జ్ఞానయజ్ఞం నుండి సామాజిక పరివర్తన దిశగా

జ్ఞానానికి, విలువలకు, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచిన కీర్తిశేషులు లికొడూరి రాజయ్య లి స్మారకార్థం ప్రతి సంవత్సరం వారి పేరుమీద లిలిక్విజ్, వ్యాసరచన, ఉపన్యాస, ముగ్గుల పోటీలులి నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు అందించడం మా గ్రంథాలయ సంప్రదాయంగా మారింది.
గ్రంథాలయ ఆవరణలో గౌతమ బుద్ధుడులి మరియు లివిద్యాదేవత సరస్వతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని నిర్ణయిం చుకుని ఈ ఆలోచనను లివేముల శ్రీనివాసులులి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తన విశాల హృదయాన్ని చాటుతూ ఒడిశాలోని లికటక్‌లి నుండి ఏడు అడుగుల అద్భుతమైన విగ్రహాలను బహూకరించారు. అవి కేవలం శిల్పాలు కాదు; జ్ఞానం, శాంతి, మహోన్నతమైన భారతీయ సంస్కృతికి ప్రతీకలు .
భారతదేశ సామాజిక పునరుజ్జీవనానికి మార్గదర్శకులైన మహాత్మా జ్యోతిరావు ఫూలే, లిలిసావిత్రిబాయి ఫూలే, తెలంగాణ ఆత్మగౌరవానికి, మేధో చైతన్యానికి ప్రతీకగా నిలిచిన లిలిఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్‌లి విగ్రహాలను కూడా ప్రజా గ్రంథాలయం ముందు ప్రతిష్ఠించాము.
గ్రంథాలయం యొక్క నిజమైన విజయాన్ని భవనాల ఎత్తుతో కొలవరు; అక్కడ శిక్షణ పొందిన మనుషులు ఉన్నత శిఖరాలకు ఎదిగిన ఎత్తుతో కొలుస్తారు. ఆ ప్రమాణంతో చూస్తే ములుకనూర్ ప్రజా గ్రంథాలయం తన లక్ష్యాన్ని గర్వంగా సాధించింది. ఈ గ్రంథాలయాన్ని ఆధారంగా చేసుకుని చదివిన విద్యార్థుల్లో దాదాపు లిముప్పై మందికి పైగా యువతీ యువకులులి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. లిహెల్త్ శాఖ, లిలిఆర్.ఆర్.బీ., లిలిపంచాయతీ కార్యదర్శి, లిలిగ్రూప్--4, లిలిడి.ఎస్.సి., ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు నేడు లిలిసివిల్స్‌లి వంటి అత్యున్నత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అనేక మంది యువతకు ఈ గ్రంథాలయం స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తోంది.
ప్రస్తుతం ఈ ప్రజా గ్రంథాలయం తన లిపుష్కరోత్సవాలలి వైపు విజయోత్సాహంతో అడుగులు వేస్తోంది. పన్నెండు సంవత్సరాల నిరంతర ప్రజా సేవకు గుర్తుగా నిర్వహించబోయే ఈ వేడుకలు, జాతీయ స్థాయి తెలుగు కథల పోటీల బహుమతి ప్రదానోత్సవం జూలై 19న గ్రంథాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరగనున్నాయి.
ప్రభుత్వం నిర్మించిన భవనాల కంటే, సమాజం నిర్మించిన సంస్థలు శాశ్వతంగా నిలుస్తాయి. ములుకనూర్ ప్రజా గ్రంథాలయం ఆ సత్యానికి సజీవ సాక్ష్యం. ప్రభుత్వ సహాయం కోసం నిరీక్షించకుండా, సమాజంలోని ప్రతి వర్గం చేయి చేయి కలిపి ఒక గ్రామ జ్ఞానభవనాన్ని నిర్మించగలదని ములుకనూర్ తెలంగాణకు చూపించింది. అందుకే ఈ గ్రంథాలయం ఒక భవనం కాదు; ఒక ఉద్యమం.

**ఈ సందర్భంగా తెలంగాణ సమాజానికి ఒక హృదయపూర్వక విజ్ఞప్తి...**
మద్యం విక్రయించే ప్రతి గ్రామంలో ఒక వైన్స్ దుకాణం ఉండగలిగితే, విజ్ఞానాన్ని పంచే ఒక ప్రజా గ్రంథాలయం ఎందుకు ఉండకూడదు?
ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం అంటే---ప్రతి ఇంటిలో ఒక విద్యార్థి. ప్రతి విద్యార్థిలో ఒక ఆలోచన. ప్రతి ఆలోచనలో ఒక నవ సమాజం.
గ్రంథాలయాలు పెరిగితే జైళ్లు తగ్గుతాయి...
పుస్తకాలు పెరిగితే మూఢనమ్మకాలు తగ్గుతాయి...
చదివే సమాజం పెరిగితే చీకట్లు తొలగిపోతాయి...
జ్ఞానం వికసిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది...
అందుకే---లిప్రతి గ్రామానికి ఒక ప్రజా గ్రంథాలయం, ప్రతి మనిషికి ఒక పుస్తకం, ప్రతి తరానికి ఒక జ్ఞానదీపంలి అనే మహత్తర లక్ష్యంతో మనమందరం ముందుకు సాగాలి.
"ముల్క్ కా నూర్ " గా ప్రసిద్ధి గాంచిన
ములుకనూర్ ప్రజా గ్రంథాలయం అందిస్తున్న సందేశం...
ఈ చారిత్రక సందేశాన్ని అంది పుచ్చుకుంటూ ములుకనూర్ గ్రామ పరిసర ప్రాంతాల లోనున్న అన్ని గ్రామాల్లో గ్రంథాలయాల స్థాపన,విస్తరణ ఓ గొప్ప ప్రజా ఉద్యమ రూపాన్ని సంతరించుకుని ముందుకు సాగాలనే మా సంకల్పం నెరవేరడానికి అందరూ సహకరించాలని
పిలుపునిస్తున్నాం...


డా.ఎదులాపురం తిరుపతి
అసిస్టెంట్ ప్రొఫెసర్
డిపార్ట్మెంట్ అఫ్ పొలిటికల్ సైన్స్ పీజీ ఉమెన్స్ కాలేజ్
కాకతీయ యూనివర్సిటీ
9441313559




# వేగవంతంగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.
- కొత్తపల్లి,ములకనూరు, చిగురు మామిడిలో రోడ్డు నిర్మాణం అలైన్మెంట్ పరిశీలన



**కరీంనగర్:జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిది)**
కొత్తపల్లి నుంచి హుస్నా బాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికా రులను ఆదేశించారు.శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి,చిగురు మామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్య టించి ఫోర్‌లైన్ రహదారికి సంబంధించిన భూసర్వే, అలైన్‌మెంట్ పనులను పరిశీలించారు.ఫేజ్-1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదా రి నిర్మాణ పనులను వేగవం తం చేయాలని అధికారుల కు సూచించారు.రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా నివాస గృహాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా,ప్రత్యా మ్నాయంగా బైపాస్ మార్గా ల ఏర్పాటు సాధ్యమా అనే అంశాలపై సమగ్రంగా అధ్య యనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అవసరమైతే గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించి,అందుకు అనుగు ణంగా నిర్ణయాలు తీసుకో వాలని సూచించారు.ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పను లు చేపట్టాలని,భూసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ ప్రక్రియ ను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపడు తూనే ప్రజల ఇళ్లకు,జీవన విధానానికి ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషన ల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీఓ షర్మిల,తిమ్మాపూర్, చిగురుమామిడి తహసీ ల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య,ఆర్ అండ్ బి డీఈ కిరణ్,ఏఈ సురేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విలాసాగర్ గ్రామంలో ఏడు నూతన సీసీ కెమెరాల ఆవిష్కరణ



**జమ్మికుంట , జూలై 17, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జమ్మికుంట మండలశీ విలాసాగర్ గ్రామంలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు సీసీ కెమెరాలను ఈరోజు ఏసీపీ హుజరాబాద్ మాధవి , జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గారు, ఎస్సై ఎన్. రమేష్ గారు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నేరాలను అరికట్టడంలో, నేరస్తులను గుర్తించడంలో, ప్రమాదాలు మరియు ఇతర అవాంఛనీయ సంఘటనలను త్వరితగతిన ఛేదించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అలాగే ప్రతి గ్రామం, కాలనీ మరియు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావన మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా భద్రత విషయంలో పోలీసులకు సహకరిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**ఇబ్రహీంపట్నం, జూలై 17 (తెలంగాణ వాణి విలేకరి):**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామపంచాయతీలో రైతులకు ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, వర్షాలు ఆలస్యమైతే అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులుగా కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటి సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల సారాన్ని పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. అదే విధంగా అమ్మక్కపేట, వేములకుర్తి, ఫకీర్ కొండాపూర్ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్, రవళిక, సాగర్ రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలపై ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష





**దేవరకొండ, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గ్రామీణ నీటిపారుదల శాఖ (ఆర్డబ్ల్యూఎస్), మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ పైప్‌లైన్ల నిర్వహణ, మోటార్ల పనితీరు, నీటి నిల్వ సామర్థ్యం, లీకేజీలు, మరమ్మతులు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా పర్యవేక్షణ పెంచాలని, ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ మంచినీటి కొరత లేకుండా చూడటమే లక్ష్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన ప్రొఫెసర్ జ్యోత్స్నా

**ఖమ్మం, జూలై 17 (తెలంగాణ వాణి)**



ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లందు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త బాసాని నాగేశ్వరరావును తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరునగరి జ్యోత్స్న శుక్రవారం పరామర్శించారు. అలాగే ప్రమాదంలో కాలికి గాయమైన ఖమ్మం యువనేత బైరు అప్పారావును కూడా కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖమ్మంలోని నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ నాయకులు ప్రొఫెసర్ జ్యోత్స్నకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులు దృష్టి పెట్టాలి

- **పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చేలా, పాఠశాలలను పరిశుభ్రంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం శాలిగౌరారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించి, నీటి సంపు, సెప్టిక్ ట్యాంకు, అదనపు తరగతి గదుల నిర్మాణంపై ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, మట్టిదిబ్బలు, చెత్తకుప్పలు, సిమెంట్, ఇసుక, కంకర, కర్రలు, ఇనుప చువ్వలు చెల్లాచెదురుగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే డోజర్ ఏర్పాటు చేసి మొత్తం ఆవరణను శుభ్రం చేయించాలని ఆదేశించారు. నిర్మాణ సామగ్రిని ఎక్కడపడితే అక్కడ వేయరాదని, చెత్తాచెదారం కారణంగా పాములు, తేళ్లు వంటి విషజంతువులు పాఠశాలలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాత్రూములు సహా పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ప్రవల్లిక, ఇన్‌చార్జి ఎంపీడీవో రజిత, గ్రామ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో పారిశుధ్యం సరిగా లేకపోవడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని మురికి కాలువలను వెంటనే శుభ్రం చేయడంతో పాటు కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్‌ల కొలతలు సరిగా లేకపోవడంతో పలువురు విద్యార్థినులు వాటిని ధరించడం లేదని తెలుసుకుని, వెంటనే ఏపీఎంను పాఠశాలకు పిలిపించారు. యూనిఫామ్‌లు కుట్టిన టైలర్‌ను రెండు మూడు రోజుల పాటు పాఠశాలలోనే ఉంచి, విద్యార్థినుల కొలతలు తీసుకుని అక్కడికక్కడే యూనిఫా మ్‌లు కుట్టించి అందించాలని ఆదేశించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులు కంప్యూటర్లను వినియోగి స్తున్నారా, డిజిటల్ విద్య ఎలా బోధిస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ అందాయా అని విద్యార్థినులను ప్రశ్నించారు. అంతకుముందు వడ్డిపాముల ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి యూనిఫామ్‌లు, పుస్తకాలు, నోట్‌బుక్స్, కిట్లు అందాయా అని అడిగి తెలుసు కున్నారు. ఏయే సబ్జెక్టులు చదువుతున్నారో తెలుసుకుని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. భోజనం వృథా చేస్తున్న విద్యార్థులను గమనించి, అన్నం విలువ తెలిసేలా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయుడికి ఆదేశించారు. ఈ తనిఖీలో నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ సురేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో రజిత తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరా మహిళా డెయిరీ పథకంలో పారదర్శకంగా పాడి పశువుల కొనుగోలు చేయాలి

### కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, జూలై 17 (తెలంగాణ వాణి)**
ఇందిరా మహిళా డెయిరీ పథకం అమలులో పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారుల జాబితా ఖరారైన వెంటనే రుణాలు మంజూరు చేసి, వారి ఆమోదంతోనే నాణ్యమైన పాడి పశువులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి వారం 25 మంది లబ్ధిదారులకు 50 పాడి పశువులు అందించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. పాడి పశువుల కొనుగోలు కోసం ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) రూపొందించి, ప్రతి మండలంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నాణ్యత, పారదర్శకతను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే పరిపాలనా వ్యయాలను నియంత్రిస్తూ, లబ్ధిదారులకు కొనుగోలు విధానంపై ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డీఆర్‌డీఓ శ్రీరామ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. పురంధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## పాలే రాములు మృతి బాధాకరం

### దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**డిండి జులై 17( తెలంగాణ వాణి ప్రతినిధి )**
డిండి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన పాలే రాములు మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం సింగరాజుపల్లి గ్రామంలో రాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాములు మరణం కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు. రాములు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పానుగోటి రవీందర్ రావు, జంగయ్య,రమావత్ తులసిరామ్,తదితరులు ఉన్నారు.

## రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

- **తక్కువ నొప్పి.. వేగంగా కోలుకునే అవకాశం**
- **యశోద హాస్పిటల్స్ సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ చినబాబు**

**ఖమ్మం, జూలై 17 (తెలంగాణ వాణి)**
రోబోటిక్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ వంటి ఆధునిక సాంకేతికతలతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇవి కేవలం క్యాన్సర్‌ను తొలగించడమే కాకుండా రోగుల జీవన నాణ్యతను మెరుగుపరుస్తున్నాయని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ, రోబోటిక్ ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ చినబాబు తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హై--డెఫినిషన్ 3డీ విజన్, ట్రెమర్--ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. పెద్ద కోతలు లేకుండా కేవలం 8 మిల్లీమీటర్ల చిన్న రంధ్రాల ద్వారానే శస్త్రచికిత్సలు చేయడం వల్ల రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు, వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. గర్భాశయ, అండాశయ, రొమ్ము, ప్రోస్టేట్, కిడ్నీ, మూత్రాశయం, పెద్దపేగు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సలో రోబోటిక్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ మెరుగైన ఫలితాలు ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్‌లో అవసరమైన లింఫ్ నోడ్లను మాత్రమే తొలగించడం వల్ల చేతి వాపు, నొప్పి వంటి సమస్యలు తగ్గుతున్నాయని చెప్పారు. అలాగే కిడ్నీ క్యాన్సర్‌లో ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి మిగతా ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడే అవకాశం ఈ సాంకేతికతతో సాధ్యమవుతోందన్నారు. ఈ ఆధునిక విధానాల వల్ల ఆసుపత్రిలో ఉండే రోజులు తగ్గడంతో పాటు రోగులు త్వరగా సాధారణ జీవితంలోకి తిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్ దూడ, ఖమ్మం మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభోత్సవం



**రాయికోడ్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం షాపూర్ గ్రామంలో గత కొన్నేళ్లుగా మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఘనంగా పునఃప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, గ్రామ సర్పంచ్ బీరదర్ నాగేశ్వరరావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల విద్యాధికారి నర్సింలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజల సహకారంతో పునఃప్రారంభమైన ఈ పాఠశాల గ్రామ విద్యాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు

**ఎల్లారెడ్డి, జూలై 17: తెలంగాణ వాణి ప్రతినిధి**
రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, చెరువులు, కుంటలు నిండిపోవాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక సలాతుల్ ఇస్తిస్కా (వర్ష ప్రార్థన) నిర్వహించారు. నమాజ్ అనంతరం అల్లాహ్‌ను వేడుకుంటూ దేశ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని, కరువు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని హృదయపూర్వకంగా దువా చేశారు. అల్లాహ్ తన అపార కరుణతో సమృద్ధిగా వర్షాలు ప్రసాదించి రైతుల కష్టాలు తొలగించాలని, పంటలు పుష్కలంగా పండాలని అందరూ మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు, మత పెద్దలు, యువకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.



## కాంగ్రెస్ నాయకుడు ఎర్రోళ్ల సాయిలు మృతిపై డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ సంతాపం

**ఎల్లారెడ్డి, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎర్రోళ్ల సాయిలు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. మృతుడి నివాసానికి వెళ్లిన ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రజా పండరి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేడు బ్రాహ్మణపల్లిలో కొమ్మిడి నర్సింహారెడ్డి సంతాప సభ




**భువనగిరి, జూలై 17 (తెలంగాణ వాణి విలేకరి)**
భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి సంతాప సభను బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన స్మారక సంచిక ను ఆవిష్కరించనున్నారు. అభిమానులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించాలని కుటుంబ సభ్యులు కోరారు.

## బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



**బాలానగర్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ రికార్డులు, కేసుల నిర్వహణ, పరిశుభ్రత, ఆయుధాగారం, మౌలిక వసతులను పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండొద్దని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. తనిఖీలో సీఐ మహేష్, ఎస్ఐ నరేందర్ రెడ్డి తదితర పోలీసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన భూమ్‌పల్లి సర్పంచ్, వార్డు సభ్యుడు



**ఎల్లారెడ్డి, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివనగర్ మండలం భూమ్‌పల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్, వార్డు సభ్యుడు బండ శ్రీను ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నూతన సభ్యులు తెలిపారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు నేటి తరానికి ఆదర్శప్రాయం

**తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**వనపర్తి, జూలై 17, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో బ్రిటిష్ రెసిడెన్సి పై దాడి అనే అంశంపై శుక్రవారం దర్బార్ హాల్లో చరిత్రక సదస్సు ఘనంగా నిర్వహించారు. చరిత్ర సదస్సుకు విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ అధ్యక్షతన నిర్వహించారు. చరిత్ర సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా చరిత్ర విభాగ విద్యార్థినులు ప్రదర్శించిన బ్రిటిష్ రెసిడెన్సి పై దాడి చారిత్రక నాటిక విశేషంగా ఆకట్టుకుంది. తుర్రె బాజ్ ఖాన్, మౌల్వి అల్లావుద్దీన్ నాయకత్వంలో జరిగిన విరోచిత పోరాటాన్నివిద్యార్థినులు హృద్యంగా ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.మాజీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు టి వివేక్, డాక్టర్ పద్మ రచించిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం- కల్లోల భరిత సంవత్సరాలు" గ్రంథాన్ని ఆవిష్కరించారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ 1857 తొలి స్వాతంత్ర సంఘం గ్రామంలో హైదరాబాద్ లోని బ్రిటిష్ రెసిడెన్సి పై జరిగిన చారిత్రక దాడిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమానికి నిర్వహించడం నేటి తరానికి ఆదర్శ ప్రాయమని అన్నారు. బ్రిటిష్ రెసిడెన్సిపై జరిగిన దాడి తెలంగాణ చరిత్రలో ఒక స్ఫూర్తిదాయక ఘట్టమని పేర్కొన్నారు.చరిత్రను తెలుసుకోవడం అంటే మన మూలాలను తెలుసు కోవడమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అమరవీరుల త్యాగాలు వచ్చే తరాలకు ఆదర్శంగా ఉండాలని ప్రముఖ విశ్వ విద్యాలయాలకు, కళాశాలలకు అమరవీరుల పేర్లు పెడుతూ గౌరవిస్తున్నారని తెలిపారు. వీరనారి చాకలి ఐలమ్మ పేరు మీద ఉన్న ఈ విశ్వ విద్యాలయం మహిళా సాధికారతకు ప్రతీక అని కొనియాడారు.చరిత్ర స్ఫూర్తితో సమాజాభివృద్ధి, దేశ ప్రగతి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎల్ పాండురంగారెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్దులపల్లి గ్రామపంచాయతీలో వైద్య శిబిరం

**-- పలువురికి ఉచిత మందుల పంపిణీ**



**మహాదేవపూర్ జులై 17 తెలంగాణ వాణి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో గ్రామస్తులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సర్పంచ్ సరిత గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏ ఎన్ ఎం సిహెచ్ విజయ,ఆశా వర్కర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్ శ్రీకళ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ పోచమ్మ దేవాలయంలో ఘనంగా కుంకుమార్చన

**తెల్లాపూర్ జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెల్లాపూర్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేసి, వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, భక్తులు తమ కుటుంబాల సుఖశాంతి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.





## ఆగస్టు 31లోగా సీసీఐ పునరుద్ధరణపై స్పష్టత లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష

**మాజీమంత్రి జోగు రామన్న**

**ఆదిలాబాద్, జులై : 17 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆగస్టు 31లోగా ఆదిలాబాద్ సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రకటించారు. సీసీఐ పునఃప్రారంభం కోసం అవసరమైతే ప్రాణాలను సైతం లెక్కచేయబోనని స్పష్టం చేశారు.స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీసీఐ అంశంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పక్క రాష్ట్రంలోని స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇస్తుండగా, ఆదిలాబాద్ ప్రజలు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించినప్పటికీ సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించకుండా విక్రయించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని అన్నారు. 2017లో ఎన్నికల సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదిలాబాద్ ప్రజలకు సీసీఐ పునరుద్ధరణపై హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. సీసీఐ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడమే కాకుండా, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు



కూడా కనీస చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. సీసీఐలో చట్టవిరుద్ధంగా స్క్రాప్ టెండర్లు పిలిచారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటిని అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు కమిషన్లు వచ్చే పనులపైనే దృష్టి ఉందని, ఐదువేల మంది యువతకు ప్రతి సంవత్సరం ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.సీసీఐ సాధన సమితి పరిశ్రమ పునఃప్రారంభం కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుంటే, స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ప్రజల ముందుకు రావడం లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, హంసరాజ్ గంగారాం, అనంత్ గీతే తదితరులు గతంలో సీసీఐ పునరుద్ధరణపై హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం ఆదిలాబాద్ ప్రజలను, యువతను మోసం చేసినట్లేనని న్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్ నిధులతో సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించేందుకు కేంద్ర సహకారం కోరినా స్పందన రాలేదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఆదిలాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి పర్యటన సమయంలో భూముల అంశాలపై చూపుతున్న ఆసక్తిని సీసీఐ పునరుద్ధరణపై కూడా చూపాలని ఎమ్మెల్యేకు జోగు రామన్న సూచించారు. ఆగస్టు నెలాఖరులోగా సీసీఐ పునరుద్ధరణపై స్పష్టత రాకపోతే సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షతో పాటు ఉధృత నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, విజ్జగిరి నారాయణ, సాజితోద్దీన్, రాజన్న, బట్టు సతీష్,దాసరి రమేష్,పరమేశ్వర్, సురేందర్, ఆసిఫ్, అశోక్, అనిల్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూభారతి రీ-సర్వే లక్ష్యం

**గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు: కలెక్టర్ రాజర్షిషా**

**బజార్‌హత్నూర్, జూలై 17 (తెలంగాణ వాణి):**
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు వ్యవసాయ భూముల రక్షణ కోసం ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతతో భూభారతి రీ-సర్వే చేపడుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండలం గంగాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామసభలో పాల్గొన్న ఆయన అనంతరం డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 509 గ్రామాల్లో తొలి విడతగా 70 గ్రామాల్లో రీ-సర్వే చేపడుతున్నామని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత భూములను డిజిటలైజ్ చేసి ప్రతి భూమికి ఆధార్ తరహాలో 'భూదార్ కార్డు' జారీ చేస్తామని చెప్పారు. దీనివల్ల భూముల రిజిస్ట్రేషన్, కొనుగోలు, విక్రయాలు పారదర్శకంగా జరిగి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నందున రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని, తేమను నిల్వ చేసే పద్ధతులు అవలంబించడంతో పాటు అవసరమైతే కంది, పెసర, మినుములు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. డెడ్రా, మాన్కాపూర్ గ్రామాల పర్యటనలో గ్రామీణ సమస్యలను సమీక్షించిన కలెక్టర్, అటవీ శాఖ అనుమతులు వచ్చినందున నిలిచిపోయిన రోడ్డు పనులను పునఃప్రారంభిస్తామని,



వీబీజీ రాంజీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మాన్కాపూర్‌లో గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సాగునీటి కోసం అటవీ శాఖ అనుమతులతో త్రీ-ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చేరేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాన్కాపూర్ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు ఏడి ప్రభాకర్ అందజేసిన స్మార్ట్ టీవీని కలెక్టర్ ప్రారంభించి, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను అభినందించారు. ఈ గ్రామసభ, పర్యటనలలో భూ సర్వే శాఖ ఏడి ప్రభాకర్, తహసీల్దార్ శ్యామ్ సుందర్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్, సర్పంచ్లు సుభాష్, విజయ, అనిల్, ఏవో సౌద్, ఏఈఓ ప్రవీణ్, ఉపాధ్యాయుడు దేవ్ రావ్, స్థానిక రైతులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ

**తలమడుగు, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల్లో మాజీ ఎంపీ సోయం బాపూరావు మంజూరు చేసిన రూ.50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు.మాజీ ఎంపీ సోయం బాపూరావుతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో కొత్త నందిగామ, చిన్న మందగూడ, ఝరి షేక్‌గూడ, పూనగూడ, కోసాయి, రత్నపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అనంతరం టేకుగూడలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులకు భూమిపూజ



**ఆదిలాబాద్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆదిలాబాద్ పట్టణంలోని తిరుపల్లి రామాలయంలో భక్తుల సౌకర్యార్థం 15వ ఆర్థిక సంఘం మున్సిపల్ నిధులతో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న బాత్రూమ్‌లు, టాయిలెట్లకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ భూమిపూజ చేశారు. అనంతరం ఆర్టికల్--275 నిధులతో రూ.4 కోట్ల వ్యయంతో టి.డబ్ల్యూ.జె. కళాశాల ప్రాంగణంలో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఎంపీ గోడం నగేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అనూషా సతీష్ మాట్లాడుతూ పట్టణంలో రూ.40 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలో రూ.100 కోట్లతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలి

- **ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఆన్ లైన్ వేగంగా పూర్తి చేయాలి:**
- **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్, జూలై 17 ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, శుక్రవారం ఖానాపూర్ మండలంలో పర్యటించారు. గోదావరి నది పుష్కర ఘాట్లను పరిశీలించారు. పట్టణంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ తీరును చూశారు. ముందుగా ఖానాపూర్ పట్టణంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ సరళిని చూశారు. తప్పనిసరిగా గడువులోగా ఆన్ లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం ఓటర్ల సంఖ్య, ఇప్పటి వరకు తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తిచేసిన ఆన్ లైన్ వివరాలు అధికారులను అడిగారు. బిఎల్ఓ యాప్ ను పరిశీలించారు. ప్రక్రియను మొత్తం పారదర్శకంగా చేయాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని చెప్పారు. బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో ఓటర్లకు ఫారములు నింపుటలో సహకారం అందించాలని చెప్పారు. అనంతరం గోదావరి నది పుష్కర ఘాట్లను పరిశీలించారు. గోదావరి నది పుష్కరాల నిర్వహణకు ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు



చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు పుష్కరఘాట్లకు చేరుకునే విధంగా తగిన రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. పుష్కర ఘాట్లను భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సోయబ్ హుస్సేన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను కలిసి శాలువా తో సన్మానించిన బాల శంకర్ కృష్ణ



**అదిలాబాద్, జులై : 17 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
అదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి.. జిల్లాలోని దళిత సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుసరం నీలాదేవి,రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట ప్రవీణ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అడిషనల్ కలెక్టర్లు రాజేశ్వర్,ఆర్. చిత్రు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**పుష్కర ఘాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్,జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సోన్ మండలంలోని పుష్కర ఘాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పుష్కరాల నాటికి ఘాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. గత పుష్కరాల్లో నమోదైన భక్తుల రద్దీ వివరాలను తెలుసుకొని, ఈసారి అంచనా మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. చేపట్టే అన్ని పనులు నాణ్యతతో, మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లకు



చేరుకునే మార్గాల్లో స్పష్టమైన సూచికల బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, తగిన పార్కింగ్ సౌకర్యాలు, రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, లైటింగ్ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ అనిల్, తహసీల్దార్ సంతోష్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట బస్టాండ్ భూ కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలి: ఎంపీ కడియం కావ్య

**హనుమకొండ, జూలై 17 (తెలంగాణ వాణి టౌన్):**
కాజీపేటలో ప్రతిపాదిత నూతన బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు.సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణన్‌లను కలిసి వినతిపత్రం అందజేసిన ఆమె, భూ మార్పిడి ప్రక్రియలో జాప్యం కారణంగా బస్టాండ్ నిర్మాణం ఆలస్యమవుతోందని వివరించారు. రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి భూ మార్పిడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయితే వరంగల్--హనుమకొండ--కాజీపేట ప్రాంత



ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ తెలిపారు.

## అంబులెన్స్‌లోనే సుఖప్రసవం..

కనగల్ : 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్‌లోనే గర్భిణికి సురక్షితంగా ప్రసవం నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడారు. చండూరు మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన టేకుల కుశల (22)కు గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే కనగల్ 108 అంబులెన్స్‌లో ఈఎంటీ మండలి సత్యనారాయణ, పైలట్ రాంబాబు గ్రామానికి చేరుకుని గర్భిణిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో ప్రసవ నొప్పులు తీవ్రం కావడంతో ఆసుపత్రి వైద్యుల సూచనల మేరకు అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. కుశల పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. వైద్యాధికారులు, గ్రామస్థులు అభినందించారు

## వసతిగృహంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం



**వనపర్తి : జూలై 17, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం (బి)లో ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం వసతి గృహంలోని బాత్రూములు, మరుగుదొడ్లు, డ్రైనేజీలు, ప్రాంగణం పరిసరాలను ప్రత్యేకంగా శుభ్రపరిచి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. శానిటేషన్ నాగమ్మ తో కలిసి క్యాటరింగ్ సిబ్బంది లక్ష్మి, ఎల్లయ్య, వాచమన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వసతి గృహ వాతావరణం కోసం సమిష్టిగా కృషి చేశారు. స్వచ్ఛ హాస్టల్ లో అందరూ భాగస్వామ్యం కావాలని వసతి గృహ సంక్షేమ అధికారి పసుల సత్యనారాయణ యాదవ్ సూచించారు. ఉదయం ప్రేరణ, ప్రేయర్ అనంతరం వసతి గృహ సంక్షేమ అధికారి విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు.

## జాబ్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్




**ఆదిలాబాద్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నకిలీ నియామక ఉత్తర్వులు ఇచ్చి మోసాలకు పాల్పడిన జాబ్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడు మహ్మద్ బాబర్‌ను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. గ్లోబల్ ఫౌండేషన్ పేరుతో ప్రభుత్వ అటెండర్ (స్కిల్ అసిస్టెంట్) ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి నుంచి రూ.5.30 లక్షలు వసూలు చేసి, నకిలీ నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, తాజాగా గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ బాబర్‌ను ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి నకిలీ నియామక పత్రాలు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, ఇలాంటి మోసాలపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు.

## ఫ్రైడే--డ్రైడేతో దోమల నివారణపై అవగాహన



**మంచిర్యాల, జూలై 17 (తెలంగాణ వాణి)**
మంచిర్యాల పురపాలక పరిధిలోని నస్పూర్, సీసీసీ, సీతారాంపల్లి వార్డుల్లో శుక్రవారం ఫ్రైడే--డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మేయర్ ధరణి మధుకర్, డీఎంహెచ్‌వో డా. నరేందర్ రాథోడ్ ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, దోమల వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులతో పాటు నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు శుభ్రమైన నీటిని వినియోగించాలని, ఇంటి చెత్తను మున్సిపల్ సిబ్బందికే అందించాలని ప్రజలకు సూచించారు. ్యున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం, శుక్రవారం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు, ఫాగింగ్, లార్వా నిర్మూలన చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## చౌటుప్పల్‌లో సిపిఎం ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి

### సిపిఎం చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు



**చౌటుప్పల్, జూలై 17(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 2026 జూలై 20న ఉదయం 10.30 గంటలకు చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్లో నిర్వహించే ప్రాంతీయ సదస్సును పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని సిపిఎం చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతీయ సదస్సుకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బీవీ రాఘవులు గ ముఖ్య వక్తగా హాజరై ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ శాఖల కార్యదర్శులు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం పంతంగి, అంకిరెడ్డిగూడెం, ఎస్ లింగోటం, జై కేసారం, కుంట్ల గూడెం, మందోల్లగూడెం ,పెద్ద కొండూరు, చిన్న కొండూరు ,మల్కాపురం, తూప్రాన్ పేట, కైతాపురం, ధర్మోజి గూడెం పార్టీ నాయకులకు ఆహ్వానాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు పొట్ట శ్రీనివాస్, పల్లె మధు కృష్ణ, బోదాస్ వెంకటేష్ ,ఎల్లమల్ల సంజీవ ,జక్కిడి దేవేందర్ రెడ్డి, మీసాల శీను, శాఖ కార్యదర్శులు రత్నం శ్రీకాంత్, జక్కిడి రమణారెడ్డి, కొంతం శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల మహేష్, పురుషోత్తం, తగరం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్స్ హటావో 14వ వార్డ్ బచావో

**చౌటుప్పల్, జూలై 17(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కౌండిన్య నగర్ మరియు విశ్వకర్మ కాలనీ వాసులు తమ కాలనీలో నిర్వహిస్తున్న కొన్ని మహిళల హాస్టళ్ల వల్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ రాత్రి వేళల్లో అధిక రాకపోకలు, ద్విచక్ర వాహనాలపై వేగంగా సంచరించడం, బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా చేరడం వంటి అంశాల వల్ల మహిళలు, వృద్ధులు మరియు స్థానిక కుటుంబాలు అసౌకర్యానికి గురవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను పరిశీలించాలని కోరారు. సంబంధిత హాస్టళ్లు అన్ని చట్టబద్ధమైన అనుమతులతోనే నిర్వహించబడుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ని వినతి పత్రంలో కోరారు. అవసరమైతే పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని కాలనీలో నిఘా పెంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని,14వ వార్డు కౌండిన్య నగర్ మరియు విశ్వకర్మ కాలనీ వాసులు తమ కాలనీలో శాంతి, భద్రత మరియు ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు



తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## సర్వే ప్రక్రియ పొడిగింపులో బీఆర్ఎస్ కృషి: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువు పొడిగింపులో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి మండలంలోని చందాపూర్, దత్తాయిపల్లి, శ్రీనివాసపూర్, చిన్నగుంటపల్లి తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ఐఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం**
వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన నాగనమోని తేజేశ్వర్ ఇటీవల జరిగిన ఐఐఐటీ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 792వ ర్యాంకు సాధించి గుజరాత్‌లోని గాంధీనగర్



ఐఐఐటీలో సీటు పొందిన సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయనను స్వగృహంలో సన్మానించి అభినందించారు. ఉన్నత విద్యలో రాణించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ తేజేశ్వర్‌కు నూతన వస్త్రాలు బహూకరించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

- తక్కువ నీటి అవసరమయ్యే పంటల వైపు రైతులు మళ్లాలి
- 'తెలంగాణ జలసిరి'తో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి
- ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగింపు
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్,జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ, జల సంరక్షణ చర్యలు, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎల్‌నీనో ప్రభావంతో జూలై నెలలో సుమారు 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా సోన్ మండలంలో 50 శాతం వరకు వర్షాభావం ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 4.30 లక్షల ఎకరాల్లో పంటల సాగు కొనసాగుతోందన్నారు. నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే వరి నాట్లు వేయాలని రైతులకు సూచించిన కలెక్టర్, సాగునీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా కంది, ఆయిల్‌పామ్, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలను సాగు చేయాలని కోరారు. ఒక ఎకరంలో కంది పంట ద్వారా 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా లాభపడే అవకాశం ఉందన్నారు. వరి సాగు వల్ల నీటి కొరత కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో అవగాహన పెరుగుతోందని, గతంలో 400 ఎకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం ఈ ఏడాది 1,200 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు సాగు చేసే అవకాశం ఉండటంతో పాటు ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు కూడా అందిస్తోందన్నారు. పందిరి కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ అందుబాటులో ఉందని చెప్పారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని వివరించారు. రైతులకు అవసరమైన సలహాలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు 89777 51785 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్



తెలిపారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. "ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, ప్రతి పొలానికి ఒక ఫామ్ పాండ్" లక్ష్యంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. 8ఐ8, 16ఐ16, 20ఐ20 పరిమాణాల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. బోర్‌వెల్‌ల వద్ద రీచార్జ్ పిట్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద ఫామ్ పాండ్ల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పంట మార్పిడి, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత ప్రచారం చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు నష్టాలను నివారించి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రభుత్వం ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, అన్‌కలెక్టెడ్ ఫారాల పరిష్కారంతో కలిపి మొత్తం 81 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌ను బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా భూముల రిసర్వే నిర్వహించాలి

**మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్.**

**మెదక్ / టేక్మాల్ / జూలై 17 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ప్రభుత్వం చేపట్టిన భూముల రి సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు , శుక్రవారం అల్లాదుర్గం మండలకేంద్రం లోనీ నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ భూ సమస్యలు తలెత్తకుండా ,ప్రతి రైతుకు భూ హక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. రైతులకు భూ వివాదాలు లేకుండా చేసి , ప్రతి భూ కమతానికి భూధార్ అందిస్తామన్నారు. పక్కగా భూ రీసర్వే చేసి హద్దులను నిర్ణయించేందు కే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం టేక్మాల్ మండలంలో విలేజ్ బౌండరీ సంబంధిత తహసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావు లేకుండా రైతులకు మేలు చేకూరే విధంగా



పటిష్ట ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,స్థానిక టేక్మాల్ తహసిల్దార్ తులసిరామ్ , రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం

**నర్సాపూర్, జూలై 17**
**(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు నీలం రంగు బ్లౌజ్, లేత పసుపు--ఆకుపచ్చ పూల డిజైన్‌తో కూడిన నీలం అంచు చీర ధరించి ఉండగా, ఆమె వద్ద పసుపు--పచ్చ రంగు లంగా కూడా ఉన్నట్లు వెల్లడించారు. మృతురాలిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : ఎస్‌హెచ్‌వో, నర్సాపూర్: 87126 57941, సీఐ, నర్సాపూర్: 87126 57940



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి:

**భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు చేపట్టాలి:**
**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**




**నిర్మల్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఇందిరమ్మ ఇండ్లు, భూగర్భ జలాల సంరక్షణ చర్యలు, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మండలాల వారిగా ఆయా దశల్లో ఉన్న ఇండ్ల నిర్మాణాలు, లబ్ధిదారులకు అందించిన ఆర్థిక సహాయం, తదితర వివరాలను అధికారులను అడిగారు. ఎంపీడీవోలు తప్పనిసరిగా రోజువారిగా పంచాయతీ కార్యదర్శులతో ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించాలన్నారు. ఇండ్ల నిర్మాణ విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని తెలిపారు. భూగర్భ జలాల పెంపులో భాగంగా ఫాం పాండ్స్, తదితర రైన్ వాటర్ రిచార్జింగ్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. వర్షపు నీటిని సంరక్షించి, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైన్ వాటర్ రిచార్జింగ్ నిర్మాణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వే అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలి

### అడిషనల్ కలెక్టర్ బి. శ్రీలత



**కోరుట్ల రూరల్, జూలై 17 (తెలంగాణ వాణి)**
భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి రీ-సర్వే అవకాశాన్ని సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బి. శ్రీలత సూచించారు. శుక్రవారం కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహించిన భూభారతి అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు రీ-సర్వే ప్రయోజనాలను వివరించారు. రీ-సర్వే ద్వారా భూముల హద్దులు శాశ్వతంగా నమోదై, భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తుదారులకు కూడా ఈ ప్రక్రియ ద్వారా అవకాశం కల్పిస్తామని చెప్పారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ దోడ రంజిత్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తాగి వచ్చి తల్లిదండ్రులపై దాడి.. కుమారుడిపై కేసు నమోదు

**వీణవంక, జులై 17 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :**
మద్యం మత్తులో తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన కుమారుడిపై వీణవంక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనకం కొమురమ్మ (60), ఆమె భర్త సామ్సన్‌ను వారి కుమారుడు కనకం రాజయ్య రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవలకు దిగుతూ, కుటుంబ ఆస్తులన్నీ తనకే ఇవ్వాలని వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని కొమురమ్మ తన భర్తకు చెబుతుండగా ఆగ్రహించిన రాజయ్య ఇద్దరినీ అసభ్య పదజాలంతో దూషించి, చేతులతో పాటు కట్టెతో దాడి చేశాడు. ఈ ఘటనలో కనకం కొమురమ్మ కుడి చేతికి గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు కనకం రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు



## ఓటు నమోదులో బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలిఎమ్మెల్యే కృష్ణారావు



**హైదరాబాద్/ శేరిలింగంపల్లి జూలై 17(తెలంగాణ వాణి విలేకరి)**
శేరిలింగంపల్లి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియలో బూత్ లెవల్ అసిస్టెంట్ లు అప్రమత్తంగా ఉండాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం రోజు కొండాపూర్ డివిజన్అధ్యక్షుడు అల్లావుద్దీన్ పటేల్, మమత, సంతోష్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇక్కడ గెలిచి పార్టీ మారిన వారు, అధికార పక్షం వారు కుట్రలు పన్ని ఓట్లు తొలిగించే ప్రయత్నం చేస్తున్నారని కాబట్టి బిఆర్ఎస్ వాళ్ళు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరు దగ్గరుండి ఓటర్లకు సహకరించాలని సూచించారు. నాయకుల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే వాటిని వీడి పార్టీ కోసం పనిచేయాలన్నారు. లేదంటే రేపు జరగబోయే ఎన్నికల్లో కొత్తవారికి అవకాశం ఇస్తామన్నారు. ఆశావహులు కలిసికట్టుగా ఉంటూ ప్రజల్లో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నాయుడు, బలరాజ్, ఎండి. జుబేర్, ఎండి మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తాం: వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్




**హైదరాబాద్/శేరిలింగంపల్లి, జూలై 17 (తెలంగాణ వాణి విలేకరి):**
రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసి పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు. మియాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌లో ఎంతోకాలం పనిచేసినా తన సేవలకు తగిన గుర్తింపు, గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులకు నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి అన్ని డివిజన్లలో కమిటీలు ఏర్పాటు చేస్తామని, రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. "ఇప్పుడే ఆరంభం.. అసలు కార్యాచరణ ఇక ముందుంది" అని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ శిబిరాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్



**పటాన్‌చెరు, జూలై 17 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటికే 60 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మిగిలిన ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర ఎస్ఐఆర్ పూర్తయిందని తెలిపారు. సర్వర్ సమస్యలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారు సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## కేసీఆర్ కిట్ పథకాన్ని నిలిపివేయడం సరికాదు

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రసూతి మహిళల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో అందించిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు ప్రస్తుతం అందడం లేదని మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రసూతి మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకాన్ని నిలిపివేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను కూడా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అదే సమయంలో ప్రసూతులు ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

# ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచాలి

### బి.ఎల్.ఓలతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల: జులై 17(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పురోగతి, నమోదు శాతాలపై శుక్రవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరై బి.ఎల్.ఓలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపించి, వాటిని త్వరితగతిన బి.ఎల్.ఓలకు అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరును నమోదు ప్రక్రియలో భాగస్వామి చేసేలా బి.ఎల్.ఓలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల తహసీల్దార్లు రామ్ మోహన్, హకీమ్, సూపర్వైజర్లు, బి.ఎల్.ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వరుస చోరీల కేసుల నిందితుడు అరెస్టు

### హుస్నాబాద్ ఏసీపి ఎస్. సదానందం నేరస్తుడి వివరాలు వెల్లడి.

**హుస్నాబాద్ జూలై 17 (తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లాహుస్నాబాద్, అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన వరుస చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. మహదేవ్‌పూర్ మండలం దుబ్బగూడెంకు చెందిన రౌతు పవన్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను హుస్నాబాద్ ఏసీపీ పి.ఎస్. సదానందం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితుడు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయి కరీంనగర్‌లో నివసిస్తూ దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నాడని తెలిపారు. సొంత నివాసం లేక వంతెనల కిందఉంటూ అవకాశం దొరికినప్పుడల్లా చోరీలకు పాల్పడేవాడని చెప్పారు. జూన్ 18న అక్కన్నపేట మండలం చౌటపల్లి సమీపంలోని పెద్దమ్మ ఆలయంలో, జూన్ 26న హుస్నాబాద్ పట్టణంలోని నాలుగు దుకాణాల్లో, జూలై 2న మార్కండేయశ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హుండీతోపాటు సమీపంలోని ఓ ఇంటిలో జరిగిన చోరీలను కూడా అతడే చేసినట్లు విచారణలో తేలిందన్నారు. హుస్నాబాద్ సీఐ కె. శ్రీధర్ నేతృత్వం లో నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించగా, కరీంనగర్‌లో దాచిన 11కిలోలపంచలోహ విగ్రహం, 56 గ్రాముల బంగారం, 76 గ్రాముల వెండి, రూ.23,500 నగదుస్వాధీనం



చేసుకున్నట్లు తెలిపారు. చోరీ సొత్తు లో కొంత భాగాన్ని సుజాత అనే మహిళవద్దఉంచినట్లు గుర్తించి, ఆమె ఇంటి నుంచి కూడా స్వాధీనం చేసుకున్నట్లువెల్లడించారు. నిందితుడిపై మంచిర్యాల, వరంగల్, హుజూరాబాద్, కరీంనగర్, హుస్నాబాద్ ప్రాంతాల్లో సుమారు 40 చోరీ కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు. ఇప్పటికే మరో కేసులో మంచిర్యాల పోలీసులు అరెస్టు చేసిన నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించడం ద్వారాఈకేసులుఛేదించినట్లు చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన హుస్నాబాద్ ఎస్సై పి.లక్ష్మారెడ్డి, సీసీఎస్ బృందం, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు నరేశ్, శ్రీనాథ్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఏసీపీ సదానందం అభినందించారు.

## భర్త హత్య కేసులో భార్యకు యావజ్జీవం

### రూ.10 వేల జరిమానా విధించిన జగిత్యాల జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు

**జగిత్యాల:జులై 17(తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన భర్త హత్య కేసులో నిందితురాలు బత్తుల ప్రమీల (25)ను దోషిగా నిర్ధారిస్తూ జగిత్యాల ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, 2022 నవంబర్ 11న కొడిమ్యాల గ్రామానికి చెందిన బత్తుల శ్రీను తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో, భార్య బత్తుల ప్రమీల అక్రమ సంబంధం నేపథ్యంలో జరిగిన వివాదంలో అతడిని హత్య చేసింది. అనంతరం సంఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించే ఉద్దేశంతో మృతదేహాన్ని చీరతో ఉరివేసుకున్నట్లు కనిపించేలా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో తేలింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసును మొదట అప్పటి సీఐ బి. కోటేశ్వర్ దర్యాప్తు చేయగా, అనంతరం సీఐ డి. రమణమూర్తి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో పటిష్టమైన ఆధారాలు సమర్పించారు. (పీపీ) రామకృష్ణారావు సాక్షులను కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జగిత్యాల ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి శుక్రవారం (జూలై 17, 2026) తీర్పు వెలువరిస్తూ నిందితురాలు బత్తుల ప్రమీలను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితురాలికి శిక్ష పడేలా సమర్థంగా పనిచేసిన ప్రభుత్వ అభియోజకుడు రామకృష్ణారావు, దర్యాప్తు అధికారులు ఇన్‌స్పెక్టర్లు బి. కోటేశ్వర్, డి. రమణమూర్తి, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ హరీష్, సీఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి: ఎస్పీ మహేష్ బి. గితే

**వేములవాడ, జూలై 17 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, స్వీయ రక్షణతో పాటు కుటుంబ క్షేమం కోసం హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నాంపెల్లిలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి





కారణాల వల్లే అధికశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు నాంపెల్లి--అనుపురం ప్రధాన రహదారిపై చెట్లకు రేడియం స్టికర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రబ్బర్ స్ట్రిప్స్, బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ.25 వేల ప్రోత్సాహక నగదు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, రవాణా శాఖ అధికారులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- సంక్షేమ పాఠశాలల్లో మెనూను సమర్థవంతంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల:జులై 17(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, భోజనం సమయానికి అందుతున్నదా అనే



అంశాలపై ఆరా తీశారు. అలాగే డైట్ మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, తాగునీటి వినియోగం, ఆహార పదార్థాల నిల్వ, కిచెన్ షెడ్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి అందించే భోజనం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా, నాణ్యంగా ఉండాలని సూచించారు. వంటశాలల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాజ్‌కుమార్, జిల్లా విద్యాధికారి కె. రాము, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, తహసీల్దార్, ఎంపీడీవో, మండల విద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్వతంత్రం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా ఇంకా వీడని కుల వివక్ష

**ధర్మారం జులై 17 (తెలంగాణ వాణి )**



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో అసిస్టెంట్ కుక్ /హెల్పర్ పోస్ట్ కు కాంట్రాక్టు ప్రాతిపదికన అర్హత కలిగిన మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ యొక్క పోస్ట్ ను తీసుకోవడానికి బీసీ ఏ కులానికి చెందిన ఏడవ తరగతి ఉత్తీర్ణత చెందిన వారు అర్హులని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని మండల ఎంఈఓ పి ప్రభాకర్ ప్రకటన విడుదల చేశారు. ఇక్కడ కుల వివక్షత స్పష్టంగా కనబడుతుందని జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత సుంచు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్న ఈ దేశంలో ఇంకా కుల వివక్షత కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ దేశంలో ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన ఎస్సీలు అసిస్టెంట్ కుక్ / హెల్పర్ పోస్ట్ కు ఉపయోగపడరా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ నిబంధనల మేరకు జరుగుతుందా? కావాలనే ఉద్దేశంతోనే బీసీఏ కులానికి చెందిన మహిళా అభ్యర్థులను ఆహ్వానిస్తున్నారా అర్థం కాని సంఘటన అని పేర్కొన్నారు. అంటే అసిస్టెంట్ కుక్ కానీ హెల్పర్ కానీ వండినా వడ్డించినా ఇతర కులాలకు చెందిన విద్యార్థులు భోజనం చేయడానికి ఇష్టపడరా అని ప్రశ్నించారు. ఇది కదా కుల వివక్షత అని మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయమై ఎంఈఓ పోర్ట్ ప్రభాకర్ ను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలు మేరకు రోస్టర్ పద్ధతిలో బిసి ఏలకు ఈ దఫా కేటాయించినట్లు తెలిపారు.

## వర్షాభావం నేపథ్యంలో పంట మార్పిడి తప్పనిసరి

### కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరికి బదులుగా సరుగుడు, ఆయిల్ పామ్, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో రైతులతో సమావేశమైన కలెక్టర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో కాలువల ద్వారా సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. నష్టాలను నివారించేందుకు పంట మార్పిడి అవసరమని చెప్పారు. సరుగుడు పంటకు కూడా డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ సబ్సిడీ కల్పించాలని రైతులు కోరగా, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి బైపాస్ మార్గం పరిశీలన



**తిమ్మాపూర్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కొత్తపల్లి--హుస్నాబాద్ నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి, ముల్కనూరు, చిగురుమామిడి మండలాల్లో భూసేకరణ, అలైన్‌మెంట్ పనులను సమీక్షించిన కలెక్టర్, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట బైపాస్ రోడ్ల ఏర్పాటుపై సర్వే నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం గ్రామసభలు నిర్వహించి స్థానికుల అభిప్రాయాలు సేకరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పంపిణీ

**పటాన్ చెరు, జూలై 17, (తెలంగాణ వాణి రిపోర్టర్)**

ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ డివిజన్ కి చెందిన కూరపాటి రేణుక గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధ పడుతుంది. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని శుక్రవారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసి లతోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే: నరేడ్ల ప్రవీణ్ రెడ్డి



**జమ్మికుంట, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలేనని బీజేపీ రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షుడు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. జమ్మికుంటలో నిర్వహించిన బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నికల హామీలు అమలు కాలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతినే కాంగ్రెస్ కొనసాగిస్తోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలంటే బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ˇమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, జీడీ మల్లేష్, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకూర్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫోర్‌లైన్ రహదారి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**చిగురుమామిడి, జూలై 17 (తెలంగాణ వాణి విలేకరి):**

కొత్తపల్లి--హుస్నాబాద్ ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. చిగురుమామిడి మండలం ముల్కనూరులో భూసర్వే, అలైన్‌మెంట్ పనులను పరిశీలించిన కలెక్టర్, ఫేజ్-1లో కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైతే బైపాస్ మార్గాల ఏర్పాటుపై గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని, భూసర్వే పనులను త్వరగా పూర్తి చేసి నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తహసీల్దార్లు, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్/హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ధర్మారం, జూలై 17 (తెలంగాణ వాణి):**



ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ కుక్/హెల్పర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ తెలిపారు. ధర్మారం మండలానికి చెందిన బీసీ--ఏ మహిళా అభ్యర్థులు జూలై 18 నుంచి 20 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై, 25--55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, 7వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్లను జతచేసి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం కేర్‌టేకర్/వార్డెన్‌కు దరఖాస్తులు అందజేయాలని ఎంఈఓ సూచించారు.

## ఘనంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడి కుమార్తె జన్మదిన వేడుకలు






**జహీరాబాద్, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ కుమార్తె ఏంజెల్ ఏమిమా తొలి జన్మదిన వేడుకలు జహీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఆర్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, మాజీ ఉపముఖ్యమంత్రి డా. తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి డా. ఎ. చంద్రశేఖర్, ఎమ్మెల్యే కొనియేటి మాణిక్‌రావు తదితరులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఎంఆర్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నీట్‌లో 606 మార్కులతో మెరిసిన కొత్తగూడెం విద్యార్థిని

- 23 లక్షల మంది అభ్యర్థుల్లో ఆల్ ఇండియా ర్యాంక్
- 8182 సాధించి ప్రతిభ చాటిన యువతి
- విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రముఖులు

**కొత్తగూడెం జూలై 17 (తెలంగాణ వాణి)**

భద్రాద్రి జిల్లాకు చెందిన ప్రతిభావంతురాలు నీట్ 2026 పరీక్షలో విశిష్ట ప్రతిభ కనబరిచింది. మెడికేర్ డయాగ్నస్టిక్ సెంటర్ యజమాని డాక్టర్ ఉపేంద్రరావు మనవరాలు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సిరి దంపతుల కుమార్తె 700 మార్కులకుగాను 606 సాధించి 2026 పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ 8182 ను కైవసంచేసుకుంది. దేశ వ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు పోటీ పడిన ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం ద్వారా కొత్తగూడెం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని, చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టిన ఆమె నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ విజయాన్ని అందుకుంది. ఆమె సాధించిన విజయం పట్ల కుటుంబ సభ్యులు, వైద్య వర్గాలు, స్నేహితులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, పట్టుదల, కృషి ఉంటే లక్ష్యాలను తప్పక చేరుకోవచ్చని విద్యావేత్తలు పేర్కొన్నారు.

## ఆపత్కాల పంట ప్రణాళిక పై అవగాహన కార్యక్రమం

**రాయికల్: జూలై 17(తెలంగాణ వాణి):**

"ఆపత్కాల పంటల ప్రణాళిక పై అవగహన కార్యక్రమం "లో భాగంగా శుక్రవారం రోజున ఆలూరు గ్రామంలో వరికి ప్రత్యామ్నాయంగా కంది,పెసర, మినుము,జొన్న,సజ్జలు,రాగి వేసుకోవచ్చని పంట సాగులో వాడవాల్సిన ఎరువుల గురించి, పురుగుల తెగుళ్ల సమస్యలు మరియు వాటి నివారణ పద్ధతుల గురించి,అదే విధంగా కూరగాయల పంటలైన ఉల్లి, బీర,కాకర సాగులో పాటించవలసిన మెలకువల గురించి వివరించడం జరిగింది.అదే విధంగా రాంరెడ్డి రైతు యొక్క మొక్కజొన్న,టమాటో పంట పొలాలను సందర్శించి పురుగుల నివారణ గురించి,యాజమాన్యం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస నుండి శాస్త్రవేత్తలు డా. పి. రవి,డా. కే. రాజేష్, డా. కే. స్వాతి,డా. కే. రామక్రిష్ణ,డా. వై. స్వాతి,అగ్రి హబ్ రూరల్ కోఆర్డినేటర్



దివ్యశ్రీ,గ్రామ సర్పంచ్ స్వామి,పాక్స్ చైర్మన్ రాజారెడ్డి,అభ్యుదయ రైతులు రాంరెడ్డి,రాజు,లక్ష్మీనారాయణ, తిరుపతి,గంగారెడ్డి,శేఖర్,మల్లారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

## సిరిసేడులో విజయ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ ఈటల రాజేందర్

**ఇల్లంతకుంట, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ఇల్లంతకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన కొక్కుల దేవేందర్ సతీమణి విజయ ఇటీవల మృతిచెందడంతో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## నిరుద్యోగ భృతి హామీతో యువతను బీఆర్ఎస్ మోసం చేసింది: కొల్కురి నరసింహారెడ్డి



**పటాన్‌చెరు, జూలై 17 (తెలంగాణ వాణి రిపోర్టర్):**

2018 ఎన్నికల్లో నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని అమలు చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కురి నరసింహారెడ్డి విమర్శించారు. పటాన్‌చెరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని, ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మరోసారి నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతీన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిధులు దారి మళ్లిస్తే ఊరుకోం: బండి సంజయ్

**రాజన్న సిరిసిల్ల, జూలై 17 (తెలంగాణ వాణి)**

: కేంద్రం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలకు మళ్లించడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే కేంద్రానికి లేఖ రాసి, అవసరమైతే నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించారు. సిరిసిల్లలో అమృత్--2 పథకం కింద రూ.105 కోట్లతో చేపట్టనున్న కార్గిల్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి నిధులను నిర్దేశిత పనులకే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం విడుదల చేస్తున్న నిధులతోనే తెలంగాణలో అనేక అభివృద్ధి పనులు



జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే అమృత్--2 పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## జూలై 31లోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి

**జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్**

**మెదక్, జూలై 17 (తెలంగాణ వాణి):**

జిల్లాలోని అర్హులైన రేషన్ కార్డుదారులందరూ జూలై 31లోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ సూచించారు. పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టామని తెలిపారు. అన్ని రేషన్



దుకాణాలు ప్రతిరోజూ తెరిచి ఉంచి, సాధారణ లబ్ధిదారులతో పాటు పోర్టబిలిటీ (వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్) ద్వారా రేషన్ పొందుతున్న వారి ఈ-కేవైసీ కూడా పూర్తి చేయాలని డీలర్లకు ఆదేశించినట్లు చెప్పారు. అర్హులైన రేషన్ కార్డుదారులు సమీప రేషన్ దుకాణాన్ని సందర్శించి గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

## శ్రీ చైతన్య హై స్కూల్ ఆధ్వర్యంలో హరితోత్సవ కార్యక్రమం

**ఎమ్మెల్యే, మండల విద్యాధికారికి మొక్కల పంపిణీ...!**

**జహీరాబాద్/టౌన్: జూలై 17(తెలంగాణ వాణి ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని శ్రీ చైతన్య హై స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో హరితోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సందేశం అందించారు.కార్యక్రమంలో పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే, మండల విద్యాధికారికి (ఎంఈఓ) విద్యార్థులు మొక్కలను అందజేసి హరితహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కల పంపిణీ నిర్వహించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## వేములవాడలో ఘనంగా మత్తడి పోచమ్మ, బద్ది పోచమ్మ బోనాలు



**వేములవాడ, జూలై 17 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**

వేములవాడ తూర్పువాడలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీ మత్తడి పోచమ్మ, శ్రీ బద్ది పోచమ్మ అమ్మవార్ల బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



**ధర్మారం, జులై 17 (తెలంగాణ వాణి )**

ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి అద్నేటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు.10వ తరగతి విద్యను అభ్యశిస్తున్న ఎన్ సంధ్య, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినిలు ఎస్ రితిక, ఏ హర్షిని జిల్లాస్థాయిలో మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పరువు పందెం పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈనెల 18న మెదక్ జిల్లా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ విద్యార్థినిలు పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్ రాజ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు బైకని కొమురయ్య, మేకల సంజీవరావుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇసుక దొరకదా.. పేదవాడి పరిస్థితి ఏంటి..?





**జమ్మికుంట జులై 17, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**

కరీంనగర్ జిల్లాలో విలాసాగర్, తనుగుల, కొండపాక, జమ్మికుంట ప్రాంతాల్లో ఇసుక కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పేద కుటుంబాలు ఇసుక అందుబాటులో లేక పనులు నిలిచిపోతున్నాయని 3000 లకు దొరికే ఇసుక 7000 ఐనా దొరకడం లేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్థానిక అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## నీట్‌లో ప్రతిభ చాటిన రాజాపేట విద్యార్థిని సంజన

**రాజాపేట, జూలై 17 (తెలంగాణ వాణి విలేకరి)**



రాజాపేటకు చెందిన సకినాల సంజన నీట్--2026 పరీక్షలో బీసీ--బీ కేటగిరీలో 408వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. పవర్‌లూమ్ కార్మికుడు సకినాల చిరంజీవులు, మాధవి దంపతుల కుమార్తె అయిన సంజనకు ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు లభించే అవకాశం ఉంది.జనగామ ఏబీవీపీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన సంజన 989 మార్కులు సాధించింది. సాధారణ కుటుంబం నుంచి వచ్చి కష్టపడి ఈ విజయం సాధించడం గ్రామానికి గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు ఆడెపు శ్రీశైలం సంజనను అభినందించారు.

## సాక్షిత సారీ వేడుకలో పాల్గొన్న పింగిలి రమేష్



**వీణవంక, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీణవంక మండలం కోర్కల్ జంగంపల్లి గ్రామంలో పుదరి అనిల్--గీత మౌనిక దంపతుల కుమార్తె సాక్షిత సారీ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంకు జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్ హాజరై సాక్షితను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొని సాక్షితకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నూతన అధ్యక్షులు

**సిద్దిపేట, జూలై 17 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



చేర్యాల పర్యటనలో భాగంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, చేర్యాల మండల అధ్యక్షుడు మంజ మల్లేశం, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.లై 23న ఎంపీ జన్మదినం సందర్భంగా, పార్లమెంట్ సమావేశాల నిమిత్తం ఢిల్లీకి వెళ్లనున్న నేపథ్యంలో ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మెదక్ జిల్లాకు రానున్న హీరో మంచు విష్ణు

**మెదక్, జూలై 17 (తెలంగాణ వాణి):**
జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, పర్యాటక శాఖ ఆహ్వానం మేరకు శనివారం మెదక్ జిల్లాకు రానున్న టాలీవుడ్ హీరో మంచు విష్ణుకు ప్రజలు, అభిమానులు ఘన స్వాగతం పలకాలని జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్ కోరారు. మంచు విష్ణు ఉదయం 8:30 గంటలకు ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయాన్ని దర్శించుకుని, అనంతరం మెదక్ ఖిల్లాను సందర్శిస్తారు. ఉదయం 11:15 గంటలకు మెదక్ క్యాథడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మీడియా ప్రతినిధులతో సమావేశమవుతారు. ఆయన పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టూరిజం శాఖ వెల్లడించింది.

## వర్షాల కోసం గ్రామ దేవతలకు నీలాభిషేకం



**జమ్మికుంట, జులై 17, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం రంగమ్మపెల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామ మహిళలు శుక్రవారం గ్రామ దేవతలు, కులదైవాలకు నీలాభిషేకం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఒక్కో బిందె నీటిని తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి, సంప్రదాయ పాటలు పాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



**మెదక్, జూలై 17 (తెలంగాణ వాణి):**
వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జ్ఞానేశ్వర్ శుక్రవారం సందర్శించి విద్యార్థినులకు వర్షాకాల ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి వ్యాధుల నివారణకు పరిశుభ్రత పాటించాలని, శుభ్రమైన నీరు, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. 14--15 ఏళ్ల బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని, జిల్లాలో ఇప్పటికే 70 శాతం టీకాకరణ పూర్తైందని తెలిపారు. అలాగే అల్బెండాజోల్ మాత్రలు తీసుకోని విద్యార్థులు జూలై 20న జరిగే మాప్-అప్ కార్యక్రమంలో తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్, వంటశాల, తాగునీరు, వాష్‌రూమ్‌లు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, దోమల నివారణ, ఆహార భద్రతపై పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

**పటాన్‌చెరు, జూలై 17 (తెలంగాణ వాణి):**




పటాన్‌చెరు డివిజన్‌లోని గౌతమ్‌నగర్, గొల్లబస్తీ, మున్నూరు కాపు సంఘం, జేపీ కాలనీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటరు నమోదు శిబిరాలను మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రజలు కూడా వివరాలను సరిచూసుకుని ఫారాలు సమర్పించాలని కోరారు. అనంతరం ఎంకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, బీఎల్ఏలకు మధ్యాహ్న భోజనం, తాగునీటి ఏర్పాట్లు చేశారు. ఎస్ఐఆర్ గడువు ఆగస్టు 3 వరకు పొడిగించబడిన నేపథ్యంలో ప్రజలందరూ తమ ఓటరు వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కును కాపాడుకోవాలని మెట్టు కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# ట్యాలీ ఆధారిత అకౌంటింగ్ నైపుణ్యాలతో ఉపాధి పెరుగుతుంది

- రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్
- శాతవాహన వాణిజ్య కళాశాలలో

**మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి కార్యశాల ముగింపు**

**కరీంనగర్:జులై 17 (తెలంగాణ వాణి)**
శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కోసం నిర్వహిస్తు న్న అకాడమిక్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రామ్ -- 100 రోజుల కార్యాచరణ”లో భాగంగా ఏర్పాటు చేసిన “కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ యూజింగ్ ట్యాలీ ఈ ఆర్పీ 9 -- ఏ స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్”మూడు రోజుల శిక్షణా కార్యక్రమం విజయ వంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన విశ్వవిద్యాల య రిజిస్ట్రార్ ఆచార్య పి.సతీష్ కుమార్ మాట్లాడు తూ ఆధునిక వ్యాపార, ఆర్థిక వ్యవస్థలో కంప్యూట రైజ్డ్ అకౌంటింగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. విద్యార్థులు పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు ట్యాలీ,జీఎస్టీ,పేరోల్,ఇన్వెం టరీ తదితర ఆర్థిక నివే దికల తయారీ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఇలాంటి శిక్షణ విద్యార్థుల్లో ఆత్మవి శ్వాసాన్ని పెంపొందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయన్నారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కార్యక్రమ కన్వీనర్,వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి,బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ డి. హరికాంత్ మాట్లాడుతూ, మూడు రోజుల




కార్యశా లలో కంపెనీ క్రియేషన్, లెడ్జర్ నిర్వహణ,వౌచర్ ఎంట్రీ, ఇన్వెంటరీ మేనేజ్ మెంట్,జీఎస్టీ అకౌంటింగ్, పేరోల్, బ్యాంకింగ్,ఆర్థిక నివేదికలు,ఎంఐఎస్ రిపోర్టులు,డేటా భద్రత, బ్యాకప్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు .గౌరవ అతిథిగా పాల్గొన్న ఎన్ఐటీ వరంగల్ మేనేజ్ మెంట్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ బి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం,నిర్వ హణ నైపుణ్యాలు,సామ ర్థ్యాలను కలిపి అభివృద్ధి చేసుకున్నప్పుడే విద్యార్థు లు పోటీ ప్రపంచంలో ముందంజలో నిలుస్తారని అన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగ సహా య ఆచార్యులు డాక్టర్ కె.సాయిశరణ్ మాట్లాడు తూ డిజిటల్ అకౌంటింగ్ పద్ధతులు వాణిజ్య విద్యా ర్థులకు అత్యవసరమని, ట్యాలీ ఈ ఆర్ పి 9పై అవగాహన వల్ల వ్యాపార సంస్థలు,అకౌంట్స్ విభాగా లు,స్వయం ఉపాధి రంగా ల్లో ఎంతో ఉపయోగపడు తుందని పేర్కొన్నారు.సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రమాకాంత్ మాట్లాడు తూ అన్ని విద్యా విభాగాల విద్యార్థులు తమ విషయ పరిజ్ఞానంతో పాటు సాంకే తిక నైపుణ్యాలను కూడా పెంచుకోవాలని,శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల్లో మంచి దృక్పథాన్ని పెంపొం దిస్తాయని తెలిపారు. ఆర్ట్స్,లా కళాశాల ప్రిన్సి పాల్ డా.పద్మావతి మాట్లా డుతూ,అకాడమిక్ ఎంపవ ర్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా ప్రభుత్వ కళాశాలల విద్యా ర్థులకు విశ్వవిద్యాలయ స్థాయి నిపుణుల నుంచి శిక్షణ పొందే అవకాశం లభిస్తోందని విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియో గం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాల న్నారు. ఈ సందర్భంగా కార్యశాల లో పాల్గొన్న 60 మంది విద్యార్థులకు ముఖ్య అతిథులు ప్రశంసపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో కో-కన్వీనర్లు డా.కె.తిరుప తి,డా.బి.నరేష్,డా.బి. పరశు రాములు,మేనేజ్ మెంట్ విభాగ అధ్యాపకు లు,డా.క్రిష్ణ కుమార్,డా. మనోజ్ కుమార్,సావిత్రి వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకు లు,విద్యార్థులు హాజర య్యా రు.కార్యక్రమం విజయవంతానికి సహక రించిన అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థి వాలంటీర్లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## కే.కే. కమిటీ సమావేశానికి తరలివెళ్లిన తెలంగాణ ఉద్యమకారులు

**రాజాపేట, జూలై 17 (తెలంగాణ వాణి)**
తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజాపేట మండలానికి చెందిన ఉద్యమకారులు హైదరాబాద్‌లో జరిగిన కే.కే. కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు వినతిపత్రం సమర్పిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి గౌరవ పింఛన్, ఇంటి స్థలం, వైద్య సదుపాయాలు, గుర్తింపు కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఉద్యమకారుల సమస్యలను కమిటీ సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండలానికి చెందిన పలువురు తెలంగాణ ఉద్యమకారులు మారోజు కుమారస్వామి, పెంట సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు ఠాకూ ర్ హిమ్మత్ సింగ్, రామిల్ల నరేందర్ సందిల భాస్కర్ గౌడ్,




కాకాల ఉపేందర్ చింతల దాసు, ఆకిరెడ్డి నరసింహులు, ఉచ్చేంతల బాలయ్య, కాయితి బాల్రెడ్డి, నీల బిక్షపతి, రాంగళ్ల శ్రీను వాస్, తునికి బిక్షపతి, రంగ నరేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, ఉమా, శివ శంకర్, మాడోతు శంకర్ నాయక్, వేముల గోపి తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికి ఆహుతైన ఈతవనం

**బోరు పనులు ప్రారంభించిన జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల:జూలై 17 (తెలంగాణ వాణి)**
గీతా కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ఈత వనశీ అగ్నికి ఆహుతి కాగా స్పం దించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు బోరు పనులు ప్రారంభించారు. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి ఈతవనం దగ్ధమైంది. తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు చొరవతో మూడు బోర్లు మంజూరు చేయించారు. శుక్రవారం బోరు వేయడానికి ఏర్పాట్లు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు,స్థానిక సర్పంచ్ ద్యావనపల్లి రామకృష్ణ, కోరుట్ల మార్కెట్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజి రెడ్డితో కలిసి టెంకాయ కొట్టి



పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాక్స్ చైర్మన్ చింతకుంట సాయి రెడ్డి, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్ల పు అశోక్, మునుగూరి హనుమంతు, కూర్మ తిరు పతి,మారుపాక సుమన్, తోట్ల మహేష్,పోడేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలిచే త్రిశక్తి మాత

**అమ్మవారి దేవాలయంలో అంగరంగ వైభవంగా వారాహి మాత నవరాత్రోత్సవాలు.**

**కోరుట్ల:జూలై 17 (తెలంగాణ వాణి)**
కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలిచే జగిత్యాల జిల్లాలోని కోరుట్ల పట్టణం త్రిశక్తి మాత ఆలయంలో గణేశ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో వారాహి నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వ హిస్తున్నారు.వారాహి నవ రాత్రులు ఆషాడ మాసంలో 9 రోజులపాటు జరుపుకునే ముఖ్యమైన పండుగ పర్వ దిన వేడుకల్లో వారాహి దేవిని పూజించడం ద్వారా భక్తులు శత్రువుల నుండి రక్షణ పొందుతారని కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల అపార విశ్వాసం.ఈ నవరాత్రులు జూలై 15 నుండి మొదలై జూలై 24 వరకు వారాహి నవరాత్రులు నిర్వహిస్తామని,జూలై 25న శనివారం వారాహి మాత నిమజ్జనోత్సవం కన్నుల పండుగగా జరుగు తుంది.గురువారం రాత్రి రెండవ రోజు సందర్భంగా వారాహి మాతఉత్సవ మూర్తికి పంచామృ తాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత





గంగా ధర్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగా ధర్,వారాహి మాతను దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు .వారాహి నవరాత్రుల ప్రత్యేకత ఏం టంటే శత్రువుల నుండి రక్షణ వారాహి దేవిని పూజించడం ద్వారా శత్రు వుల నుండి దుష్టశక్తుల నుండి రక్షణ లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఆషాడ మాసంలో వచ్చే ఈ నవరాత్రులు గుప్త నవరాత్రులలో భాగంగా జరుపుకుం టారని పలువురి విశ్వాసం. త్రిశక్తి మాత దేవాలయంలో గత ఏడాది వారాహి దేవి నవరాత్రులు జరుపుతున్నామని ఈ ఏడాది నుండి ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి వారా హి పూజలు జరుగుతున్నా యని నిర్వాహకులు పేర్కొ న్నారు.కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో ప్రతిరోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వారాహి త్రిశక్తి మాత అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దసరా నవరాత్రులకు, వారాహి నవరాత్రులకు తేడా ఉంటుందని ,వారాహి నవరాత్రులను గుప్త నవ రాత్రులు అంటారని,ఈ మాతకు రాత్రి వేళ పూజి స్తారని,వారాహి మాతకు రాత్రి వేళలో ధూపం,దీపం, నైవేద్యం, అభిషేకం,హోమం ఉంటాయని సూర్యాస్త సమయంలో పూజా కార్యక్రమాలు జరుపుకుం టారని పేర్కొన్నారు.

## తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా..72 శాతం బొగ్గు సరఫరా

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తున్నట్లు సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ పెరిగినందున, మరింత ప్రాధాన్యత క్రమంలో ఇంకా ఎక్కువ బొగ్గు రవాణా చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింగరేణి సీఎండీ, జెన్‌కో సీఎండీ డా. హరీష్ ప్రస్తుత విద్యుత్ డిమాండ్, బొగ్గు ఉత్పత్తి, రవాణా అంశాలపై ఉభయ సంస్థల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రకాష్ మాట్లాడుతూ... రాష్ట్ర థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు ఉండేలా ఇరు సంస్థల అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలన్నారు. నిరంతరాయ బొగ్గు రవాణాను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, రామగుండం ఎన్‌టీపీసీ, సింగరేణి థర్మల్ ప్లాంట్ కోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 72 శాతాన్ని సరఫరా చేస్తున్నట్లు మార్కెటింగ్ విభాగం అధికారులు తెలిపారు. అయితే విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే బొగ్గు నుంచి సర్దుబాటు చేసి, తెలంగాణ అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎండీ స్పష్టం చేశారు. రైల్వే రేకుల లభ్యత, రోడ్డు రవాణా తదితర అంశాల్లో అధికారులు నిరంతరం సమీక్షించుకోవాలన్నారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఏరియా జీఎంలు చర్యలు తీసుకోవాలని, నాణ్యతలో రాజీ పడకుండా ఉత్పత్తిని కొనసాగించాలని ఆదేశించారు. జెన్‌కో సీఎండీ డా. హరీష్ మాట్లాడుతూ... జెన్‌కో థర్మల్ కేంద్రాల వద్ద ఉన్న బొగ్గు నిల్వల వివరాలను వెల్లడించారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**రాయికల్: జూలై 17 (తెలంగాణ వాణి)**
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున రాయికల్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ ఆధ్యర్యంలో స్థానిక కౌన్సిలర్లు మరియు నాయకులతో కలిసి స్థానిక బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఓటర్ నమోదు పక్రియను పరిశిలించి మిగిలిన వాటిని కూడ పూర్తి స్థాయిలో చేయాలని కోరడం జరిగింది.నిరక్షరాస్యులకు పూర్తిస్థాయిలో సహకరించి వారి యొక్క ఓటరు నమోదు ప్రక్రియ లో ఎటువంటి తప్పులు దొర్లకుండా పరిశీలించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి,పట్టణ మరియు మండల బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి అనిల్,బర్కం మల్లేష్,కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్,నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి,బత్తిని నాగరాజు,కట్కం సాయి, జిల్లాల సుధాకర్,సతీష్ రెడ్డి మరియు బి ఎల్ ఓ లు పుష్పలత,రాజేశ్వరి,సుమలత పాల్గొన్నారు.

## ధర్మారం విద్యుత్ శాఖ ఏఈగా మునీందర్ రెడ్డి బాధ్యతలు

**ధర్మారం, జూలై 17 (తెలంగాణ వాణి):**



పెద్దపల్లి జిల్లా ధర్మారం విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ (ఏఈ)గా బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మునీందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ నుంచి బదిలీపై ఆయన ధర్మారానికి వచ్చారు.ఇంతకుముందు రాజారాంపల్లి, చిలువకోడూరు, జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో ఏఈగా సేవలందించారు. గత కొన్ని నెలలుగా ధర్మారం మండలంలో ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఎదురైన ఇబ్బందులకు ఇక పరిష్కారం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డీసీసీబీకి నాబార్డ్ ఉత్తమ పనితీరు అవార్డు



నాబార్డ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సహకార బ్యాంకుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకుంది. హైదరాబాద్‌లోని నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన నాబార్డ్ 45వ జాతీయ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సహకార బ్యాంకుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఎంపిక చేశారు.
తెలంగాణ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయభాస్కర్, ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) నాగభూషణం వందే, ఉప జనరల్ మేనేజర్ లింబాద్రి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు సాధించిన పురోగతి, రైతులు, మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, సహకార రంగ అభివృద్ధికి అందిస్తున్న సేవలను పలువురు వక్తలు అభినందించారు. ఈ అవార్డు బ్యాంకు పాలకవర్గం, యాజమాన్యం, ఉద్యోగుల సమిష్టి కృషికి గుర్తింపుగా లభించిందని సీఈఓ నాగభూషణం వందే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు, నాబార్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు.